



• మంగళ సూత్రాలను భక్తులకు చూపుతున్న అర్చకులు

కళ్యాణం కమనీయం

- వాడవాడలా శ్రీరామనవమి వేడుకలు
- రామ నామస్మరణలతో తరించిన భక్తజనం
- అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణోత్సవాలు
- భక్తులతో కిక్కిరిసిన శ్రీరామ, ఆంజనేయస్వామి దేవాలయాలు

బాపట్ల, తెనాలి, ఏప్రిల్ 17: శ్రీరామనవమి వేడుకలు వాడవాడలా బుధవారం అంగరంగ వైభవంగా జరిగాయి. చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా రామ నామస్మరణలతో తరించారు. జిల్లాలోని రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణాలు, పల్లెల్లో జరిగిన శ్రీసీతారాముల కల్యాణోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై తిలకించి పులకించిపోయారు. వాడవాడలా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయాల్లో వేకువ జాము నుంచే స్వామి మూలవిరాట్‌కు అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ, వడపప్పు, పానకం అందజేశారు. పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు కల్యాణంలో పాల్గొని, స్వామి వారిని దర్శించుకున్నారు.

● బాపట్ల పట్టణం, మండలంలో శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. బాపట్లలోని రథం బజారులో చలువ పందిళ్ల ఏర్పాటు చేసి నవమి వేడుక, శ్రీసీతారాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా జరిపించారు. భీమావారిపాలెంలో వేంచేసి ఉన్న శ్రీకోదండరామస్వామి దేవాలయంలో నిర్వహించిన నవమి ఉత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రేపల్లె పట్టణం, గ్రామాల్లో సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. వివిధ సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి అన్నదానాలు చేశారు. పాత స్టేట్ బ్యాంక్ వద్ద బాలభక్త బృందం వారిచే 58వ సీతారాముల కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. వేమూరు, అబ్బనగూడవల్లి, కుచ్చెళ్ళపాడు, చావలి కొత్తపాలెం, జంపని, వరహాపురం, పెనుమర్రు గ్రామాల్లోని పురాతన రామాలయాల్లో ఆగమశాస్త్ర ప్రకారం మూడు రోజుల దీక్షతో వార్షిక నవమి ఉత్సవాలు నిర్వహించారు. చావలిలోని ఎనిమిది దిక్కుల ఉన్న రామాలయాల్లో సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండుగగా జరిపారు. భద్రాద్రి రాముని కల్యాణం నిర్వహించే సమయంలోనే చుండూరు, ఆలపాడు, మండూరు, మోదుకూరు, నడిగడ్డపాలెం గ్రామాల్లో పూర్వకాలం నుంచి సంప్రదాయ బద్ధంగా జరుగుతున్న వేడుకలు ఈ ఏడాది కూడా కొనసాగాయి.



తెనాలిలో కల్యాణాన్ని తిలకిస్తున్న భక్త జనం



గాడిబావి సెంటర్‌లో కళ్యాణ శోభలో శ్రీసీతారాములు

జాతరను తలపించిన తెనాలి

శ్రీసీతారాముల కల్యాణోత్సవంతో తెనాలి మెయిన్ రోడ్డు, బోసురోడ్డు జాతరను తలపించాయి. విశాలమైన చలువ పందిళ్లలో అందమైన వేదికలు సిద్ధం చేసి స్వామివారి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ స్వామి వారిని దర్శించుకున్నారు. గాడిబావి సెంటర్‌లోని శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయం ముంగిట కన్నుల పండువగా కల్యాణం జరిపించారు. మెయిన్ రోడ్డులో పలు చోట్ల వ్యాపారులు వేదికలు ఏర్పాటు చేసి రాముల వారి కల్యాణాలను జరిపించారు.

శోభాయమానంగా శోభాయాత్ర



గుంటూరు(తూర్పు): శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా గుంటూరులో శ్రీరామ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం శోభాయాత్ర అట్టహాసంగా జరిగింది. స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద శోభాయాత్రను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ దంపతులు ప్రారంభించారు. సీతారాములు ఉత్సవ విగ్రహాలతో పాటు ఆంజనేయస్వామి విగ్రహాలను రథోత్సవంలో ఏర్పాటు చేశారు. జై శ్రీరామ్, జైజై శ్రీరామ్ నినాదాలతో భక్తులు యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాత్రలో పాల్గొన్న భక్తులకు పలు స్వచ్ఛంద సంస్థలతో పాటు కొన్ని ప్రాంతాల్లో ముస్లిం మహిళలు తాగునీరు, మజ్జిగ తదితరాలను పంపిణీ చేశారు.



పోషణ అసంపూర్ణం

- అంగన్వాడీల్లో పౌష్టికాహారం అంతంతే
- సాంకేతిక సమస్యలతో పోషణకు దూరం
- నాలుగు రకాల యాప్‌ల్లో నమోదైతేనే ఇండెంట్
- ప్రతి నెలా 30శాతం మందికి అందని పోషకాహారం
- వచ్చిన సరుకుల పంపిణీతో సరిపుచ్చుతున్న సిబ్బంది



పోషకాహారలోపంతో బాధపడే చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అంగన్వాడీల్లో పౌష్టికాహారం అందించాలి. అయితే ఏటా పాలు, కోడిగుడ్ల సరఫరా సక్రమంగా జరగక ఇబ్బందులు పడిన లబ్ధిదారులు ఇప్పుడు యాప్‌ల పుణ్యాన పోషణకు దూరమై పోతున్నారు. నాలుగు రకాల యాప్‌ల్లో తలెత్తే సాంకేతిక సమస్యల కారణంగా అనేకమందికి సక్రమంగా సరుకులు అందడంలేదు. ఒక రకంగా చెప్పాలంటే పోషణ కార్యక్రమానికే ఈ యాప్‌లు అడ్డంకిగా మారాయని ఉద్యోగులు, లబ్ధిదారులు చెబుతున్నారు. యాప్‌లన్నింట్లోనూ నమోదైతేనే ఇండెంట్ వస్తుంది లేదంటే ఆ అంగన్వాడీ కేంద్రానికి సరుకులు కేటాయింపు జరగదు. దీంతో చిన్నారులు, బాలింతలు, గర్భిణులు పోషణ అందక అల్లాడుతున్నారు.

గుంటూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ సంపూర్ణ పోషణ అంతంతగానే ఉంది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక అంగన్వాడీ వ్యవస్థ అంతకంతకూ అధ్వానంగా మారిపోతోంది. పోషకాహార లోపంతో బాధపడే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు తగిన పోషణ అందకుండానే పోతోంది. సాంకేతికంగా మరింత మెరుగుపడాల్సిన వ్యవస్థ అంతకంతకూ దిగజారిపోతోంది. నూతనంగా రూపొందించిన యాప్‌ల కారణంగా సక్రమంగా సరుకులు అందడం లేదు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో మొత్తం 5,399 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా 3 లక్షల 83 వేల మందికి పోషణ పొందుతున్నారు. గుంటూరు జిల్లాలోని 1,480 అంగన్వాడీ కేంద్రాల్లో 10140 మంది గర్భిణులు, 7,804 మంది బాలింతలు, పల్నాడు జిల్లాలోని 1888 అంగన్వాడీ కేంద్రాల్లో 12,348 మంది గర్భిణులు, 9,289 మంది బాలింతలు, బాపట్ల జిల్లాలో 2,031 అంగన్వాడీ కేంద్రాల్లో 7,738 మంది గర్భిణులు, 6,147 మంది బాలింతలు పోషణ పొందుతున్నారు. కాగా మూడు జిల్లాల్లో 2లక్షల 70వేల 950 మంది మూడేళ్లలోపు చిన్నారులు, 59 వేల 389 మంది మూడు నుంచి ఆరేళ్ల లోపు పిల్లలకు అంగన్వాడీల ద్వారా పౌష్టికాహారం అందజేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన యాప్‌ల కారణంగా వీరిలో మూడో వంతు మందికి పోషణ లభించడం లేదని తెలుస్తోంది.

◆ పోషణ ఇలా..

గర్భిణులు, బాలింతలకు ప్రతి నెలా 25 కోడి గుడ్లు, 5 లీటర్ల పాలు, 3 కిలోల బియ్యం, కేజీ కంది పప్పు, అర లీటరు నూనె, 2 కేజీల రాగిపిండి, ఒక కేజీ అటుకులు, వేరుశనగ చిక్కీలు, ఎండు కర్జూరం, బెల్లం పావు కిలో చొప్పున పోషకాహారం కింద అందిస్తారు. మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు ప్రతి నెలా 25 గుడ్లు, రెండున్నర లీటర్లు పాలు, రెండున్నర కిలోల బాలామృతం అందిస్తారు. ప్రీ స్కూల్ పిల్లలకు భోజనం అక్కడే వండి పెట్టాలి. బియ్యం 75 గ్రాములు, కందిపప్పు 15 గ్రాములు, నూనె 5 గ్రాములు మాత్రమే వారికి భోజనానికి ఇస్తారు. దాంతో పాటు రోజుకు ఒక గుడ్డు, 100 మి.లీ.ల పాలు పిల్లలకు ఇవ్వాలి. నామమాత్రంగా కేటాయించే బియ్యం, కందిపప్పు, నూనెతో పిల్లలకు సరైన భోజనం లభించడం లేదు. దీంతో ప్రీ స్కూల్ పిల్లలు పోషణకు దూరమైపోతున్నారు. కాగా మిగిలిన వారికి ఇండెంట్ సరిగా రాకపోవడంతో వచ్చినవాటితో అంగన్వాడీ సిబ్బంది సరిపుచ్చుతున్నారు.

◆ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన సంపూర్ణపోషణ యాప్‌లో లబ్ధిదారుల పేర్లు నమోదైనా, ఎఫ్ఆర్‌సీలో నమోదైనా లబ్ధిదారులకు మాత్రం ప్రభుత్వం ఇండెంట్ ఇవ్వడం లేదని అంగన్వాడీ సిబ్బంది చెబుతున్నారు. దీనిపై అధికారులను ప్రశ్నించగా అన్ని యాప్‌ల్లో లబ్ధిదారులు నమోదు కావాల్సిందేనని, ప్రత్యేకంగా పోషణ ట్రాకర్ యాప్‌లో నమోదైతేనే ఇండెంట్ వస్తుందని చెబుతున్నారని అంటున్నారు. దీనిపై రెండు రోజుల క్రితం ప్రత్యేక సమావేశం నిర్వహించి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారని కూడా తెలుస్తోంది. దీంతో సిబ్బంది పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యి చందంగా మారింది. ఇండెంట్ ఇవ్వడానికి అధికారులు ఇబ్బంది పెడుతుంటే, పోషణ రాక లబ్ధిదారులు ఒత్తిడి పెడుతున్నారు. దీంతో వారు నలిగిపోతున్నారు. అయితే ప్రభుత్వ నిర్వాకం కారణంగా లబ్ధిదారులు క్రమంగా పోషణ కార్యక్రమానికి దూరమయ్యే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది.

యాప్‌లు తెచ్చిన తంటా

గతంలో అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల హాజరు నమోదు చేసేవారు. దాని ఆధారంగా వారికి పోషణ ఖరారయ్యేది. కానీ ప్రభుత్వం తాజాగే అనేక యాప్‌లు రూపొందించింది. ప్రతిరోజూ మొత్తం నాలుగు రకాల యాప్‌ల్లో లబ్ధిదారులను నమోదు చేయాలి. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పోషణ ట్రాకర్ యాప్‌లో ప్రతి రోజూ ఆధార్ వెరిఫికేషన్ చేయించాలి. ఫేస్ రికగ్నైజేషన్ సిస్టమ్(ఎఫ్ఆర్ఎస్) యాప్‌లో ప్రతి రోజూ లబ్ధిదారుల ముఖ హాజరు నమోదు చేయాలి. వైఎస్సార్ సంపూర్ణ పోషణ యాప్‌లో పేర్లు నమోదు చేయాలి. మిల్క్ యాప్‌లో నమోదు చేయాలి. ఈ యాప్‌లలో నమోదు చేసేటప్పుడు అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. యాప్‌లో నమోదు చేసే సమయంలో ఏరోజు కారోజు అవి ఎగ్జిస్టింగ్ అని వస్తున్నాయి. దీంతో పేర్లు నమోదు కావడం లేదు. లేదంటే నేరుగా డస్టుబిన్‌లోకి పేర్లు వెళ్లిపోయి, నమోదైనది లేనిదీ తెలియడం లేదని అంగన్వాడీ సిబ్బంది చెబుతున్నారు. ఇలా అన్ని యాప్‌లలో పేర్లు సక్రమంగా నమోదైనదీ లేనిది తెలియడం లేదు. ఇండెంట్ వచ్చిన తరువాత చూసుకుంటే సగం మందికి ఇండెంట్ రావడం లేదని, దీంతో తాము కేంద్రాలను నడపడం కష్టమైపోయి, లబ్ధిదారులతో మాటలు పడాల్సి వస్తోందని సిబ్బంది వాపోతున్నారు.



నేటి నుంచి నామినేషన్లు

ఈ నెల 25 వరకు అవకాశం • ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం • ఆర్‌వో కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు

బాపట్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు ఒక లోక్‌సభ స్థానానికి నామినేషన్ల ఘట్టం గురువారం నుంచి ప్రారంభం కానుంది. గురువారం ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ జారీతో పాటు నామినేషన్ల స్వీకరణ కూడా ప్రారంభిస్తారు. ఈ నెల 25 వరకు నామినేషన్ల స్వీకరణ జరగనుంది. నామినేషన్ల స్వీకరణ కోసం ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాట్లను అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో నామినేషన్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను, పత్రాలు అందించే విభాగం, డిపాజిట్ కేంద్రాలను సిద్ధం చేశారు. నామినేషన్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతం మొత్తాన్ని సీసీ కెమెరాల నిఘాలో భద్రతను పర్యవేక్షించనున్నారు. బరిలో ఉండే అభ్యర్థులు నామినేషన్ పత్రాలను ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో అందించాలి. సువిధ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ దరఖాస్తు సక్సెస్ అయిన తర్వాత వచ్చే పత్రాలపై అభ్యర్థి స్వయంగా సంతకం చేసి ఆ కాపీలను ఆర్‌వోలకు సమర్పించాలి.

ఊపందుకోనున్న ప్రచారాలు

ఇప్పటికే ఇంటింటి ప్రచారంతో దూకుడు మీదున్న రాజకీయ పార్టీల అభ్యర్థులు నామినేషన్ల అనంతరం మరింత జోరు పెంచనున్నారు. పాలకపార్టీ వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు ఐదేళ్లలో వైసీపీ చేసిన విధ్వంసాన్ని ప్రజలకు వివరిస్తూ ప్రచారంలో టీడీపీ నేతలు ముందువరుసలో ఉన్నారు. ఆయా నియోజక వర్గాల్లో అభ్యర్థులు వారి సెంటిమెంట్ ఆధారంగా నామినేషన్లు వేయడానికి ముహూర్తం నిర్ణయించుకునే పనిలో నిమగ్నమై ఉన్నారు.

పటిష్ట బందోబస్తు ఏర్పాటు : ఎస్పీ వకుల్‌జిందాల్

నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించుకునే అభ్యర్థులు పోలీస్ శాఖకు ముందస్తుగా సమాచారం అందించాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగానే ప్రచారం సాగాలని వాటిని అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ఊరేగింపులో పది వాహనాలకు మించి ఉపయోగించరాదన్నారు. నామినేషన్ల దాఖలు సమయంలో రిటర్నింగ్ అధికారి వద్దకు అభ్యర్థితో పాటు మరో నలుగురు వ్యక్తులను మాత్రమే అనుమతించడం జరుగుతుందన్నారు. ఆర్‌వో కార్యాలయ పరిధిలోని వందమీటర్ల లోపులో అభ్యర్థికి చెందిన మూడు వాహనాలను మాత్రమే అనుమతించడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.

హామీలన్నీ.. నీటి మూటలే..

- అమలుకు నోచుకోని జగన్ వాగ్దానాలు
- శంకుస్థాపనలకే పరిమితమైన ప్రాజెక్టులు
- సీఎం హోదాలో ఇచ్చిన వరాలూ ఉత్తమాటలే



గుంటూరు ఛానల్ దుస్థితి

బాపట్ల, ఏప్రిల్ 17 (ఆంధ్ర జ్యోతి): ప్రతిపక్ష నేతగా పాదయాత్రలోనూ, ముఖ్య మంత్రి పదవి చేపట్టిన తర్వాత జిల్లా పర్యటనలో జగన్ హామీల జల్లులు కురిపించారు. అయితే ఐదేళ్లలో ఒక్కటంటే ఒక్క హామీని కూడా జగన్ నెరవేర్చిలేక పోయారు. పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశారు కానీ.. పైసా నిధులు విడుదల చేయలేదు. బాపట్లలోని మెడికల్ కళాశాల నిర్మాణం మొదలు గుంటూరు చానల్ పొడిగింపు వరకు వైసీపీ ప్రభుత్వం పట్టాలెక్కించలేకపోయింది. సీఎం హోదాలో ఇచ్చిన హామీలలో దాదాపు 90 శాతం అటకెక్కించారు. ఇక మిచౌంగ్ తుఫాన్ బాధిత రైతుల్ని ఆదుకోవడంలో కూడా శీతకన్నేశారు. బాపట్ల జిల్లాగా ఆవిర్భవించాక 2022 ఆగస్టు 11న తొలిసారి బాపట్లకు వచ్చారు. రెండోసారి డిసెంబరు 21న చుండూరు మండలం యడ్లపల్లిలో పర్యటించారు. గడచిన ఏడాది నిజాంపట్నంలో పర్యటనకు వచ్చారు. సీఎం హోదాలో పలు వరాల ను ఆయ వేదికలమీద జగన్ ఇచ్చారు. ఒక్కటంటే ఒక్క హామీ కూడా ఇంత వరకు అమలుకు నోచు కోలేదు. ప్రతిపక్ష నేత, సీఎం హోదాల్లో జగన్ ఇచ్చిన వరాలను పరిశీలిస్తే.. అద్దంకి మండలం శింగరకొండ సమీపంలోని భవనాశి చెరు వును రిజర్వాయరుగా మారుస్తానని ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదు. నామ్ రహదారి పనుల ఊసేలేదు. కొరిశపాడు మండల పరిధిలోని ఎర్రం చినపోలిరెడ్డి, తమ్మవరం -2 ఎత్తిపోతల పథకాలు పూర్తి చేస్తానన్న హామీ ఉత్తమాటలుగానే మిగిలాయి. అద్దంకి బ్రాంచ్ కాలువపై వంతె నకు మోక్షం కలగలేదు.

● గుంటూరు చానల్‌ను పెదనందిపాడు నుంచి పర్చూరు వరకు పొడిగింపునకు మోక్షం కలగలేదు. కొల్లూరు మండలం తాడిగిరిపాడు వద్ద ఎత్తిపోతల పథకం పూర్తి ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. జంపని చక్కెర కర్మాగారం ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాలేదు. బాపట్లలో ఆర్భాటంగా ప్రారంభించిన మెడికల్ కళాశాల పునాదుల దశ దాటలేదు. పర్యాటక రంగం అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తానన్న జగన్ మాటలు నీటిమూటలుగానే మిగిలిపోయాయి. ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు. చీరాల ఫిషింగ్ హార్బర్ పనులకు మోక్షం లభించలేదు. నిజాంపట్నం హార్బర్ అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి.

● కృష్ణానదిపై రెండు చోట్ల నిల్వ చేసేలా చెక్ డ్యాంల కోసం దాదాపు రూ.2,000 కోట్లతో ప్రతిపాదనలతో సరిపెట్టారే తప్ప అడుగుముందుకు పడిన పాపానపోలేదు. బాపట్ల ప్రజల దాహార్తి తీర్చడానికి అదనపు రక్షిత నీటి పథ కం చెరువు తవ్వకానికి భూసేకరణ కోసం రూ.18 కోట్లు, రహదారుల నిర్మాణానికి పది కోట్లు, మంజూరు చేస్తున్నట్లు బాపట్ల సభలో ప్రకటించగా ఇంతవరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. సముద్ర జలాలు వేమూరు నియోజకవర్గ గ్రామాల్లోకి రాకుండా కృష్ణానదిలో 4.90 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో బ్యారేజీ నిర్మిస్తానని చుండూరు మండలం యడ్లపల్లి సభలో వాగ్దానం చేశారు. అది మాటలకే పరి మితమైంది. వేమూరు నియోజకవర్గంలో పీఎంజీఎస్ కింద రహదారుల నిర్మాణానికి రూ.15.60 కోట్లు మంజూరు చేస్తానని ఇచ్చిన హామీ ఉత్తమాటలుగానే మిగిలాయి. దిండిలో రూ.185 కోట్లతో ఆక్వా పార్క్, వాడరేవులో రూ.417 కోట్లతో ఫిషింగ్ హార్బర్ హామీలు పట్టా లెక్కలేదు.



శిథిలావస్థకు చేరిన రేపల్లెలోని టిడ్కో గృహాలు



కొల్లూరు: తాడిగిరిపాడు ఎత్తిపోతల పథకం దుస్థితి

మొక్కజొన్న గింజలు ఎండబెడుతున్న రైతు



మొక్కజొన్న అంతంతే

- తెగుళ్లు, నీటి ఎద్దడితో తగ్గిన దిగుబడి
- నెల రోజుల్లో రూ.300-400 తగ్గిన ధరలు

కొల్లూరు, ఏప్రిల్ 17: ఈ ఏడాది రబీలో సాగు చేసిన మొక్కజొన్న దిగుబడులు అంతంత మాత్రంగా ఉన్నాయని రైతులు వాపోతున్నారు. తెగుళ్లు, నీటి ఎద్దడితో 10 క్వింటాళ్ల వరకు దిగుబడులు తగ్గిపోయాయి. కొల్లూరు మండలంలో సుమారు 9 వేల ఎకరాల మాగాణి భూముల్లో రైతులు ఈ ఏడాది రబీలో మొక్కజొన్న సాగు చేపట్టారు. ఖరీఫ్ చివరిలో తుఫాన్ వల్ల కురిసిన వర్షాలతో మొక్కజొన్న పైరు 20 రోజులు ఆలస్యమైంది. విత్తనాలు నాటినప్పటి నుంచి పైరును చీడపీడలు ఆశించడంతో అప్పుడే 20 శాతం మొక్కలు దెబ్బతిన్నాయి. మిగిలిన పంటను కాపాడుకుందామని రైతులు ప్రయత్నించినా సాగు నీరు సకాలంలో విడుదల కాలేదు. దీంతో పంటకు నీటి తడులు అందించేందుకు రైతులు భూగర్భ జలాలపై ఆధారపడాల్సి వచ్చింది. దీంతో రైతులకు అదనపు వ్యయ భారం పడింది. ఎకరా పైరుకు ఒక్కొక్క నీటి తడికి రూ.2 వేలు నుంచి రూ.3 వేలు వరకు ఖర్చు చేసినట్లు రైతులు తెలిపారు. ఇంత చేసినా మార్చిలో భూగర్భ జలాలు కూడా అడుగంటి పోవడంతో ఆయిల్ ఇంజన్లు, విద్యుత్ మోటార్లు మొరాయించడంతో పంటలకు నీటి తడులు అందించడం గగనంగా మారింది. ఈ ప్రభావం పంట దిగుబడులపై చూపడంతో ఎకరాకు 10 క్వింటాళ్లకు పైగా తగ్గాయని రైతులు చెబుతున్నారు. ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్లు మాత్రమే దిగుబడులు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. పైగా అధిక ఉష్ణోగ్రతలతో పొలాల్లోని పైరు ఒక్కసారిగా తిరిగమారిపోయి కండెలు ముదిరిపోయాయని వాపోతున్నారు. నెల రోజులకు ముందు మెట్ట భూముల్లో సాగు చేసిన మొక్కజొన్న పంటను దళారులు క్వింటా రూ.2400-2500 వరకు కొనుగోలు చేశారు. మాగాణి భూముల్లో పంట చేతికి వచ్చే సమయానికి దళారులు సిండికేట్‌గా ఏర్పడి రూ.300-400 వరకు తగ్గించేశారని రైతులు తెలిపారు. ఎన్నికల కారణంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారో లేదో తెలియని పరిస్థితి నెలకొందని, దీనిని అవకాశంగా చేసుకుని దళారులు ధరలు తగ్గించారని రైతులు వాపోతున్నారు.

అమరావతిని నాశనం చేశారు

- ఉన్మాది అధికారంలోకి వస్తే ఇదే జరుగుతుంది
- టీడీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్
- కూటమి నేతలతో కలసి రాజధానిలో పర్యటన


దుండగులు ధ్వంసం చేసిన అమరావతి గ్యాలరీని పరిశీలిస్తున్న పెమ్మసాని

తుళ్లూరు, మార్చి 17: ఒక ఉన్మాది అధికారంలోకి వస్తే ఏం జరుగుతుందో అమరావతి రాజధానే ఉదాహరణ అని గుంటూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. బుధవారం ఆయన రాజధాని అమరావతిలో పర్యటించారు. తొలుత ప్రధాని శంకుస్థాపన చేసిన ఉద్దండ్రాయునిపాలెంలో ధ్వంసం చేసిన అమరావతి నమూనా గ్యాలరీ పరిశీలించారు. పవిత్రమైన నీరు మట్టి నిక్షిప్తం చేసిన ప్రదేశంలో ప్రదక్షణ చేసి కొబ్బరి కాయ కొట్టారు. అనంతరం టీడీపీ ప్రభుత్వంలో కట్టిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవనాలను పరిశీలించారు. ఆ తరువాత పర్మినెంట్ అసెంబ్లీ, సచివాలయం భవనాల కోసం వేసిన ఫౌండేషన్‌లు నీళ్లలో ఉండటం, ఐరన్ తప్పు పట్టటాన్ని రైతులు పెమ్మసానికి చూపించారు. దీంతో ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శాఖమూరు లో అంబేద్కర్ స్మృతి సందర్శించి విలేకరులతో పెమ్మసాని మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత నిర్మాణ కంపెనీలను తరిమేసి అమరావతిని అడవిని చేశారన్నారు. ఇక్కడ ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందని జగన్మోహన్ రెడ్డి అబద్దాలు చెప్పారన్నారు. ఐదేళ్లలో ఓ ఒక్కటీ నిరూపించలేక పోయారన్నారు. 125 కేంద్ర ప్రభుత్వ సంస్థలకు మౌలిక వసతులు కల్పించకుండా అడ్డుకున్నాడన్నారు. పది లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే అమరావతిని నిర్వీర్యం చేశాడన్నారు. రాజధానిలో ఐదు వేల టిడ్కో గృహాలు వృధాగా వదిలేశాడన్నారు. గత ప్రభుత్వం రాజధాని అభివృద్ధికి రూపొందించిన ప్రణాళికలను జగన్ ధ్వంసం చేశాడన్నారు. ఆర్ -5 జోన్ పేరిట అభివృద్ధి కారిడార్ ప్రాంతాన్ని విధ్వంసం చేశాడన్నారు. బయట ప్రాంతాల వారికి ఇంటి స్థలం ఇక్కడ ఇచ్చి రాజకీయ లబ్ధి పొందాలని చూశాడన్నారు. అమరావతిలో ఒకే వర్గం వారికి భూములున్నాయని తప్పుడు ప్రచారం చేశాడన్నారు. 20వేల మంది చిన్న సన్నకారు రైతులు భూములిచ్చారని తెలిపారు. 70 బహుళ అంతస్తుల భవనాలను సీఎం జగన్ రెడ్డి గాలికి వదిలేశాడన్నారు. పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వలేదన్నారు. నిర్మాణాలు జరుగుతుంటే లక్ష మందికి పని దొరికేదన్నారు. అంబేద్కర్ స్మృతి వనం కోసం ఉద్దేశించిన ప్రాంతాన్ని నాశనం చేశారన్నారు. దీన్ని కూడా రాజకీయం చేసి వేరే చోట అంబేద్కర్ విగ్రహం పెట్టారన్నారు. రాజధానిలో జరిగిన విధ్వంసం చూస్తుంటే చాలా ఆవేదన కలుగుతుందని పెమ్మసాని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వం రాజధాని కోసం ఖర్చు చేసిన పదివేల కోట్ల రూపాయలు వృధా అయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. అమరావతిలో హృదయ విదారకరమైన పరిస్థితి కనిపిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు, దళిత, మైనార్టీ, మహిళా జేఏసీ నేతలు, సభ్యులు, టీడీపీ జనసేన బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




అమరావతిలో తవ్వేసిన రోడ్డును పరిశీలిస్తున్న పెమ్మసాని , రైతు జేఏసీ నేతలు


రాజధానిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రైతు జేఏసీ నేతలతో పెమ్మసాని చంద్రశేఖర్

పల్నాడును సస్యశ్యామలం చేస్తాం

- రూ. 159 కోట్లు నిధులు తెస్తే ఎమ్మెల్యే ఒక్క పని చేయలేదు
- కూటమి అధికారంలోకి రాగానే అన్ని సమస్యలకు పరిష్కారం
- నరసరావుపేట పార్లమెంట్ కూటమి అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలు
- బొల్లాకు రాజకీయ సమాధి ఖాయం : జీవీ


ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎంపీ కృష్ణదేవరాయలు

శావల్యాపురం, ఏప్రిల్ 17: ఉమ్మడి కూటమి అధికారంలోకి రాగానే గోదావరి జలాలను తెచ్చి సాగర్ కుడికాలువకు కలిపి పల్నాడు జిల్లాను పాడిపంటలతో సస్యశ్యామలం చేస్తామని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. శావల్యాపురం మండలంలో బుధవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో గోదావరి జలాలను నకరికల్లు వద్ద సాగర్ కుడికాలువకు కలిపేందుకు అనుమతులు తెచ్చి పనులు ప్రారంభిస్తే వైసీపీ ప్రభుత్వం దాన్ని నిలిపివేసిందని, కూటమి అధికారంలోకి రాగానే పనులను పునఃప్రారంభించి పల్నాడు జిల్లాలోని రైతులందరికీ రెండు పంటలకు సాగునీరందిస్తామన్నారు. వినుకొండలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు జీవీ రూ.159 కోట్లు నిధులు తెస్తే ఎమ్మెల్యే బొల్లాకు చేతకాక నిలిపివేశారన్నారు. కూటమి అధికారంలోకి రాగానే ఎస్సీ వర్గీకరణను పూర్తి చేస్తామని, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కార్పోరేషన్‌ల ద్వారా రాయితీ రుణాలిచ్చి వారిని ఆదుకొంటామన్నారు. మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి రాగానే అన్ని గ్రామాల్లో ఎన్టీఆర్ కాలనీలు ఏర్పాటు చేసి ప్రతి పేదవానికి రెండు సెంట్లు స్థలాన్నిచ్చి ఇళ్లు కట్టిస్తామన్నారు. 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 4వేలు చొప్పున ఫించన్‌ను అందిస్తామన్నారు. ఎమ్మెల్యే బొల్లా దోచుకోవడం, దాచుకోవడం తప్ప అభివృద్ధి చేసిందేమీ లేదన్నారు. బొల్లాను ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించి రాజకీయ సమాధి కట్టడం ఖాయమన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జురావు మాట్లాడుతూ ఎమ్మెల్యే బొల్లా వినుకొండను పూర్తిగా కబ్జా చేశాడని, వినుకొండ అభివృద్ధిలో ఆయన పాత్రేమీ లేదన్నారు.


లావు, జీవీలకు హారతులిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

శావల్యాపురం మండలంలో విశేష ఆదరణ

శావల్యాపురం, శానంపూడి, బొందిలిపాలెం, మతుకుమల్లి గ్రామాల్లో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాజీ ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లికార్జునరావులు బుధవారం ప్రచారం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి ప్రచారంలో పాల్గొన్నారు. శావల్యాపురంలోని ఎస్టీకాలనీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని, రైల్వేగేటు వద్ద ఆర్‌యూబీని ఏర్పాటు చేయాలని, రైల్వేలైన్ అభివృద్ధి పనుల్లో పూడిపోయిన పంటకాలువను పునరుద్ధరించి 400 ఎకరాలకు సాగునీరు అందేలా చూడాలని స్థానికులు కోరగా అధికారంలోకి రాగానే అన్నింటినీ పూర్తి చేస్తామని నేతలు హామీనిచ్చారు. శానంపూడిలో ప్రచారం నిర్వహించి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బొందిలిపాలెంలోని అడవి పేరంటాలమ్మ దేవాలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. చివరిగా మతుకుమల్లికి చేరుకొని గ్రామంలో ప్రచారాన్ని నిర్వహించారు. మతుకుమల్లిలో స్థానికులు పలు సమస్యలను ప్రస్తావించగా అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామని హామీనిచ్చారు. శావల్యాపురంలో టీడీపీలోకి చేరిన మద్దినేని అనిల్, శానంపూడిలో టీడీపీలోకి చేరిన రేషన్ డీలర్ వంకాయలపాటి సూర్యనారాయణ, మతుకుమల్లిలో టీడీపీలోకి చేరిన మందా విజయరాజు, గుంజరి పోలేశ్వరరావు, మందా శ్యాంసన్ తదితరులకు నేతలు పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి నిశ్శంకర శ్రీనివాసరావు, జనసేన వినుకొండ నియోజకవర్గ సమన్వయకర్త కొణిజేటి నాగశ్రీనురాయల్, టీడీపీ మండలాధ్యక్షులు గుంటూరు సాంబశివరావు, జనసేన మండలాధ్యక్షులు అడపాల అనిల్‌కుమార్, టీడీపీ నాయకులు గడిపూడి విశ్వనాధం, యరమాసు కోటేశ్వరరావు, బొల్లా పేరయ్య, గోరంట్ల హనుమంతరావు, గద్దె వీరమస్తాన్‌రావు, చింతా గంగయ్య, ఒత్తుల వెంకటేశ్వర్లు, అమృతపూడి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

కమనీయం.. సీతారాముల కల్యాణం

- వాడవాడలా ఘనంగా శ్రీరామనవమి వేడుకలు
- కల్యాణాన్ని తిలకించిన నారా లోకేశ్


కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న నారా లోకేశ్


సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 17: సీతారాముల కల్యాణ వేడుకలతో భక్తకోటి పులకిం చింది. శ్రీరామ నవమి ఉత్సవాలను బుధవారం వాడవాడలా అత్యంత భక్తిప్రపత్తులతో జరుపుకున్నారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పానకం, వడపప్పు తీర్థ ప్రసాదాలుగా పంపిణీచేశారు. మంగళగిరి ఏపీఎస్పీ ఆరవపటాలం వద్ద వున్న రామాలయంలో జరిగిన శ్రీరామ నవమి వేడుకలకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హాజరయ్యారు. సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కల్యాణోత్సవంలో పాల్గొ న్నారు. కష్టకాలంలో మనమందరం ఎలావుండాలో శ్రీరాముడు చూపించారని, ఆ మహనీయుని వ్యక్తిత్వాన్ని అలవర్చుకుంటే ఎలాంటి కష్టాలనుంచైనా బయట పడవచ్చని ఈ సందర్భంగా లోకేశ్ అన్నారు. రాష్ట్రంలో రామరాజ్యం ఏర్పడి ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. లోకేశ్ వెంట టీడీపీ నియోజక వర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, జనసేన ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, కూటమి నేతలు తమ్మిశెట్టి జానకీదేవి, దామర్ల రాజు, జగ్గారపు శ్రీనివాసరావు, మునగపాటి మారుతీరావు, గోవాడ దుర్గారావు, మునగపాటి వెంకటేశ్వరరావు, తోట పార్థసారధి తదితరులు వున్నారు. అనంతరం జరిగిన అన్న సంతర్పణ కార్యక్రమాన్ని ఏపీఎస్పీ బెటాలియన్స్ అడిషనల్ డీజీ అతుల్‌సింగ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎస్పీ డీఐజీ-2 వెంకటేశ్వర్లు, ఆరవ పటాలం కమాండెంట్ వి.రత్నం, అడిషనల్ కమాండెంట్ రామకృష్ణ, అసిస్టెంట్ కమాండెంట్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. పాతమంగళ గిరి సీతారామ స్వామి కోవెల, డాక్టర్ ఆంజనేయ కాలనీ, మెయిన్ బజారులోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరీ లక్ష్మీ గణపతి కోదండ రామాలయం, భార్గవపేటలోని సీతారామ నామక్షేత్రం, గోలిలింగయ్య రామమందిరం, కుప్పురావు కాలనీ, శ్రీలక్ష్మీనరసింహ స్వామి కాలనీల్లోని రామాలయాల్లో సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది.

ప్రత్యేక రైళ్లకు గుంటూరు డివిజన్‌లో హాల్టింగ్‌లు

గుంటూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఈనెల 18 నుంచి జూన్ 27 మధ్యన గుంటూరు మీదగా ప్రయాణించనున్న నెంబరు. 02863 హౌరా - యశ్వంత్ పూర్ ప్రత్యేక రైలుకు గుంటూరు డివిజన్‌లో హాల్టింగ్‌లను కల్పిస్తూ రైల్వే శాఖ నోటిఫై చేసింది. ఈ రైలు గుంటూరుకు శుక్రవారం ఉదయం 8.20కి, నరసరావుపేటకు 9.05కి, మార్కాపురం రోడ్డుకు 10.35కి, గిద్దలూరుకు 11.35కి చేరుతుంది. అలానే నెంబరు. 02864 యశ్వంత్‌పూర్ - హౌరా వీక్లీ రైలు ఈ నెల 20 నుంచి జూన్ 29వ తేదీ మధ్యన ప్రతీ శనివారం బయలుదేరుతుంది. ఈ రైలు శనివారం మధ్యాహ్నం 1.19కి గిద్దలూరు, 2.10కి మార్కాపురం రోడ్డు, 3.29కి నరసరావుపేట, సాయంత్రం 5.25కి గుంటూరు చేరుకొంటుంది. అలానే నెంబరు. 02811 భువనేశ్వర్ - యశ్వంత్‌పూర్ రైలు ఆదివారం ఉదయం 8.35కి గుంటూరు, 9.20కి నరసరావుపేట, 11.20కి మార్కాపురం రోడ్డు, 12.20కి గిద్దలూరు చేరుకొంటుంది. నెంబరు. 02812 యశ్వంత్‌పూర్ - భువనేశ్వర్ రైలు ప్రతీ సోమవారం సాయంత్రం 4.05కి గిద్దలూరు, 5.04కి మార్కాపురం రోడ్డు, 6.29కి నరసరావుపేట, రాత్రి 7.20కి గుంటూరు చేరుకొంటుంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.15
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	132, 141,152
చికెన్ విత్ స్కిన్	252.00
చికెన్ స్కిన్ లెస్	262.00

పులకించిన భద్రగిరి



భద్రగిరి పులకించింది.. భక్తకోటితో హోరెత్తింది. పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే మొదలైన వేడుక మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీఎస్ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఐజీ ఏవీ రంగనాథ్, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి తదితరులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భద్రాచలం కోలాహలంగా మారింది. -భద్రాచలం

కన్నుల పండువగా సీతారాముల కల్యాణ వేడుక


జీలకర్రబెల్లంను భక్తులకు చూపుతున్న దృశ్యం


కల్యాణం వీక్షిస్తున్న మంత్రి సురేఖ, సీఎస్ శాంతికుమారి


పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




స్వామివారి ఊరేగింపు


ద్వారకా తిరుమల దేవస్థానంవారి పట్టువస్త్రాలు


గౌతమీ నదిలో పుణ్య స్నానాలు


జగన్ పత్రికపై ఎస్ఐ భార్గవ్‌కు ఫిర్యాదు చేస్తున్న ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

జగన్ పత్రిక అసత్యపు వార్తలపై
క్రిమినల్ కేసు నమోదుచేయాలి

- ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, ఏప్రిల్17: వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కుటుంబానికి చెందిన దినపత్రికలో తనపై అవాస్తవాలు, అభూత కల్పనలు, అసత్యాలతో రాసిన కథనంపై క్రిమినల్ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన నరేంద్రకుమార్ ఎస్ఐ టీ.భార్గవ్‌కు లిఖిత పూర్వక ఫిర్యాదు అందచేశారు. అనంతరం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జగన్ పత్రికలో గతంలోనూ తనపై అసత్య కథనాలు ప్రచురిస్తే కోర్టు నోటీసులు అందచేసినట్లు చెప్పారు. జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చి నాలుగేళ్ల పది నెలల కాలంలో తనపై ఆరోపణలు ఎందుకు నిరూపించ లేకపోయ్యారని ప్రశ్నించారు. భూకబ్జాలు చేశానని, నకిలీ డాక్యుమెంట్లు సృష్టించానని, దేవాదాయ శాఖ భూములు ఆక్రమించానని చేసిన ఆరోపణల్లో ఒక్కటి కూడా నిరూపించలేదని ధ్వజమెత్తారు. వైసీపీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఐదేళ్ల కాలంలో చేసిన అక్రమాలు, అవినీతిపై ప్రజా చార్జ్ షీట్ దాఖలు చేసినట్లు చెప్పారు. ఆయిన అవినీతిపై ఒక కథనం అయినా సాక్షిలో ప్రచురించారా అన్ని ప్రశ్నించారు. మంత్రులు అంబటి రాంబాబు వంటి వారు చేస్తున్న దురాగతాలు గురించి సాక్షిలో ఎందుకు ప్రచురించటం లేదని భారతీ రెడ్డిని నిలదీసారు. తనపై దుష్ప్రచారాలు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘన కింద వస్తాయని అన్నారు. భారతీరెడ్డి నుంచి ప్రతి ఒక్కరిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని పోలీస్ శాఖను కోరినట్లు నరేంద్ర కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వేసవి తాకిడికి
వృద్ధురాలి మృతి

వినుకొండ,ఏప్రిల్ 17: వేసవి తాకిడిని తట్టుకోలేక ఓ వృద్ధురాలు మృతిచెందిన సంఘటన వినుకొండ ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం చోటుచేసుకుంది. డిపో మేనేజర్ కోటేశ్వరరావు నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. వినుకొండ పట్టణంలోని ఓబయ్యకాలనికి చెందిన కాకర్ల అంజమ్మ అనే వృద్ధురాలు నాలుగు రోజులుగా వినుకొండ ఆర్టీసీ బస్టాండ్‌లో సంచరిస్తుందన్నారు. విజయవాడ ఆర్టీసీ బస్సు పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన కుర్చీలపై ఆమె మృతి చెంది ఉండడాన్ని ప్రయాణికులు గుర్తించి తమకు సమాచారం అందించారన్నారు. వెంటనే తాము పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

కవ్వింపు చర్యల్లో వెల్ఫేర్ అసిస్టెంట్

బాపట్ల, ఏప్రిల్ 17 : బాపట్లలో ఈనెల 14వ తేదీ జరిగిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులపై కవ్వింపు చర్యలకు పాల్పడిన చర్యల్లో వెల్ఫేర్ అసిస్టెంట్ ఉన్నట్లు ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్లితే... బాపట్ల అంబేద్కర్ సర్కిల్‌లో అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న కూటమి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ, ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్‌లు కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్న సమయంలో ఎమ్మెల్యే కోన రఘుపతి వైసీపీ శ్రేణులతో మూకుమ్మడిగా టీడీపీ శ్రేణులపైకి వచ్చారు. ఎమ్మెల్యేను భుజాల మీద ఎక్కించుకొని తెలుగుదేశం పార్టీ నాయకులను కవ్విస్తూ రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తూ ఘర్షణ వాతావరణం కలిగించారు. వారిలో వైసీపీ నాయకులతోపాటు కర్లపాలెం మండలం పెద్దగొల్లపాలెం సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ వై.రమ్యకర్ ఉన్నట్లు తెలిసింది. ఎమ్మెల్యే పక్కనే ఉండి నినాదాలు చేస్తూ పైపైకి వచ్చిన వారిలో ఆయన కూడా ఉన్నట్లు వీడియో ద్వారా ఫొటోలతో గుర్తించిన టీడీపీ శ్రేణులు అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. బాధ్యత గల ఉద్యోగంలో ఉండి ఎన్నికల కోడ్ సమయంలో ఒక పార్టీకి కొమ్ముకాస్తూ వివాదాలకు దారి తీసే కార్యక్రమాల్లో పాల్గొన్న సదరు ఉద్యోగిపై చర్యలు తీసుకుని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. కాగా ఈ విషయంపై కర్లపాలెం ఎంపీడీవో నేతాజీని వివరణ కోరగా విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



తెలుగుదేశం శ్రేణులపై కవ్వింపు చర్యల్లో పాల్గొన్న వెల్ఫేర్ అసిస్టెంట్ రమ్యకర్

గొప్ప తత్వవేత్త రాధాకృష్ణన్

బాపట్ల, ఏప్రిల్ 17 : భారతీయ తత్వశాస్త్ర విశిష్టతను ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ రాష్ట్రపతి పీఠాన్ని అధిష్టించి భారతదేశ ఖ్యాతిని ఇనుమడింపజేశారని ఫోరం కార్యదర్శి డాక్టర్ పి.సాయిబాబు అన్నారు. డాక్టర్ సర్వేపల్లి 30వ వర్థంతి సందర్భంగా బుధవారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో మండల కార్యాలయం వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి రచించిన గ్రంథాలు అజరామరమైనవని అన్నారు. భారతరత్న పురస్కారం అందుకుని ఉపాధ్యాయులకు ఎనలేని ఖ్యాతి అర్జించి పెట్టారని చెప్పారు. ఉపాధ్యాయుడుగా జీవితాన్ని ప్రారంభించి అత్యున్నత స్థానానికి చేరుకోవడంలో ఆయన చేసిన కృషి అనన్య సామాన్యమైనదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ నాయకులు గురజాల శ్రీనివాసరావు, న్యాయవాదులు జె్రముద్‌బాషా, సుబ్బారావు, లక్ష్మీ పాల్గొన్నారు.



డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఫోరం కార్యదర్శి డాక్టర్ సాయిబాబు తదితరులు

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

బాపట్ల, ఏప్రిల్ 17 : బాపట్లలోని సాంఘిక, సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో మెటార్ ఉదయం ట్రస్ట్ వారు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన వారికి బుధవారం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమానికి యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు విజ్ఞానానికి, వికాసానికి ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం మొదటి బహుమతి ఏ.నాగమణి, రెండో బహుమతి ఎం.నాగదివ్య, కథ చెబుదాం పోటీలలో మొదటి బహుమతి డి.తేజస్విని, ద్వితీయ బహుమతి బి.అభిలాషలకు అందజేశారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు టి.సుభాషిణి, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

బాపట్లలో ముమ్మర తనిఖీలు : సీఐ

బాపట్ల, ఏప్రిల్ 17 : సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలను ప్రలోభాలకు గురి చేయడానికి అవకాశం ఉన్న అక్రమ మద్యం, నగదు ఇతర వస్తువుల రవాణాకు అడ్డుకట్ట వేయాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో పోలీసు అధికారులు అందుకు తగిన చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం పట్టణ సీఐ యు.శ్రీనివాసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. అనుమానిత ప్రాంతాలతోపాటు, వాహన తనిఖీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా బస్సులు, ఆటోలు, కార్లు, ద్విచక్రవాహనాలు, లారీలను, ట్రాన్స్‌పోర్టు వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా సరైన ఆధారాలు లేకుండా నగదు, నగలు తరలించరాదని హెచ్చరించారు. ఎవరైనా ఎన్నికల నియమావళి అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న పట్టణ సీఐ యు.శ్రీనివాసులు

రామాలయ అభివృద్ధికి రూ.50 వేల విరాళం

కొల్లూరు, ఏప్రిల్ 17 : రామాలయ అభివృద్ధి నిమిత్తం రూ.50 వేలు విరాళాన్ని దాత మైనేని మురళీకృష్ణ అందజేశారు. బుధవా రం శ్రీరామనవమి పురస్కరించుకుని క్రాపలోని యాదవ సామాజిక వర్గానికి చెందిన రామాలయంలో సీతారాములను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ మందిర కమిటీ సభ్యులు కొన్ని పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయని ఆయన దృష్టికి తీసుకురావడంతో వ్యక్తిగతంగా తన వంతు సాయంగా సభ్యులకు రూ.50 వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు కొత్తపల్లి మధు, కాసరనేని మోహన్‌తో పా టు కొల్లూరుకు చెందిన గద్దె నాగేశ్వరరావు, గోగినేని వెంకటేష్, మున్నంగి విజయ్ తదితరులు పాల్గొన్నారు.



క్రాపలో రామాలయ అభివృద్ధికి విరాళం అందజేస్తున్న దాత మురళీకృష్ణ

కాలువలో ఈతకు వెళ్లిన విద్యార్థి మృతి

మేడికొండూరు, ఏప్రిల్ 17: కాలువలో ఈతకు వెళ్లిన విద్యార్థి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని పేరేచర్లలో బుధవారం జరిగింది. మేడికొండూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బాపట్లకి చెందిన ఇంకొల్లు నాగేశ్వరరావు కుమారుడు కార్తీక్ (20) మేడికొండూరు మండలం డోకిపర్రు సమీపంలోని యూనివర్సల్ ఇంజనీరింగ్ కళాశాలలోనే హాస్టల్‌లో ఉంటూ బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం శ్రీరామ నవమి సెలవు దినం కావడంతో తన సహచరులతో కలిసి గుడికి వెళ్తాస్తానని చెప్పి బయటకు వచ్చారు. వీరందరూ కలసి పేరేచర్ల గ్రామ శివారులోని గుంటూరు బ్రాంచ్ కాలువ వద్దకు వెళ్లి ఈతకు దిగారు. కాలువలో ఈతకు దిగిన కార్తీక్ నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో నీటిలో మునిగి గల్లంతయ్యాడు. అతనితోపాటు వచ్చిన స్నేహితులు కార్తీక్ కాలవలో గల్లంతైన విషయాన్ని పోలీసులకు తెలియజేయడంతో హుటాహుటిన మేడికొండూరు సీఐ జయకుమార్ తన సిబ్బందితో కలసి గల్లంతైన కార్తీక్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రానికి అదే కాలువలో కొంత దూరం కొట్టుకు వెళ్లిన కార్తీక్ మృతదేహాన్ని స్థానికుల సాయంతో వెలికి తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. మేడికొండూరు సీఐ జయకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



రథం బజార్లో నిర్వహిస్తున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో పూజలు చేస్తున్న నరేంద్రవర్మ



రేపల్లెలో సీతారాముల కల్యాణంలో తలంబ్రాలు పోస్తున్న ఎమ్మెల్యే సత్యప్రసాద్

వైభవంగా సీతారాముల కల్యాణం

- తలంబ్రాలు పోసిన ఎమ్మెల్యే అనగాని
- పూజల్లో పాల్గొన్న వేగేసన



భీమావారిపాలెంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నం సతీష్ ప్రభాకర్

బాపట్ల, ఏప్రిల్ 17 : బాపట్ల పట్టణ, మండలంలో శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చలువ పందిళ్ల దేవాలయాల్లో శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి దంపతులు పీటలు మీద కూర్చున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బాపట్ల పట్టణంలోని రథం బజారులో చలువ పందిళ్లు ఏర్పాటు చేసి వేడుక ను జరిపించారు. ఈ వేడుకకు టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులు అందుకున్నారు. ఆయా కార్యక్రమాలలో భక్తులతోపాటు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. బాపట్ల పట్టణంలోని భీమావారిపాలెంలో ఉన్న శ్రీకోదండరామస్వామి దేవాలయంలో నిర్వహించిన శ్రీరామనవమి ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్‌ప్రభాకర్, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ పాల్గొని పూజలు చేశారు. అనంతరం పానకం తయారీ కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. ఆయా కార్యక్రమాలలో ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రేపల్లెలో...



రామకోటిపేట రామాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న దంపతులు

రేపల్లె, ఏప్రిల్ 17: శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని వాడవాడలా శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవాలను అత్యంత భక్తి శ్రద్ధలతో, మేళతాళాలతో, వేదపండితుల మంత్రోచ్ఛరణలతో కన్నుల పండువగా నిర్వహించారు. నియోజకవర్గంలో పట్టణం, మండలంలోని గ్రామగ్రామాన ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చలువ పందిళ్లను మామిడి తోరణాలతో శోభాయమానంగా అలంకరించారు. హిందూ సాంప్రదాయ బద్ధంగా పెండ్లికుమార్తె, పెండ్లి కుమారులను గావించిన అనంతరం శ్రీసీతారాముల కల్యాణాన్ని వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత శ్రీ స్వామివారి విగ్రహాలు, చిత్రపటాలను పట్టువస్త్రాలతో గ్రామోత్సవం గావించారు.

- శ్రీరామ నవమి వేడుకలు బుధవారం పట్టణంలో ఘనంగా జరిగాయి. పట్టణ, గ్రామాల్లో శ్రీ సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. వివిధ సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషే కాలు చేసి అన్నదానాలు చేశారు. పాత స్టేట్‌బ్యాంక్ వద్ద బాల భక్త బృందం వారిచే 58వ సీతారాముల కల్యాణ మహోత్సవా న్ని వేద పండితులు ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ పాల్గొని శ్రీరామనవమి పందిళ్లల్లో తలంబ్రాలు పోశారు. టీడీపీ నాయకులు పట్టణంలోని అన్ని పందిళ్లను సందర్శించి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- రైలుపేట శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.
- శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవ వర్తకసంఘం ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కల్యాణాన్ని అత్యంత రమణీయంగా నిర్వహించారు. రామకోటిపేటలోని రామాలయం, ప్రకాశం రోడ్, 3వ వార్డు, అరవపల్లిలో, మునసబువారిపాలెంలలో ప్రత్యేక పూజలు చేశారు. సీతారాముల వారికి తలంబ్రాలు పోశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు పానకం, అన్నసంతర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పంతాని మురళీధరరావు, గూడపాటి శ్రీనివాసరావు, తాతా ఏడుకొండలు, దేవగిరి శంకర్, తులసి దుర్గాప్రసాద్, పంతాని సాయికుమార్, దేవగిరి రవి, ఆలపాటి వేణు తదితరులు పాల్గొన్నారు.
- పట్టణంలోని మత్స్యకారులు ఆధ్వర్యంలో ఏబీఆర్ డిగ్రీ కళాశాల, కోదండరామాలయంలో, ప్రకాశం రోడ్, వినాయకుని గుడివద్ద తదితర ప్రాంతాలలో శ్రీరామనవమి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. తలంబ్రాలు పోశారు. మండలంలోని చెన్నుపల్లివారిపాలెం, పిరాట్లంకలలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. పెద్ద కూరగాయల మార్కెట్‌లో రామాలయం వద్ద సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, పానకం పంపిణీ చేశారు. రైలుపేట చిట్టూరి కాంప్లెక్స్ వద్ద శ్రీ సీతారామ కల్యాణం భక్త బృందం ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, పానకం పంపిణీ చేశారు.
- నగరం మండలం కొలగానివారిపాలెంలోని రామాలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవం సందర్భంగా కోలాటం గురువు కుప్పాల వెంకటాద్రి ఆధ్వర్యంలో వందలాది మంది భక్తుల రామభజనతో కోలాటం నిర్వహించారు.
- చెరుకుపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో సీతారాములవారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించి కమిటీ ఆధ్వర్యంలో అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు.
- వేమూరు ఏప్రిల్ 17 : శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం మండల పరిధి గ్రామాల్లో సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. రామనామ స్మరణతో గ్రామాలు మార్మోగాయి. సాయంత్రం గ్రామోత్సవాలు జరిపి పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అబ్బనగూడవల్లిలో 108మంది దంపతులతో రామ కల్యాణాన్ని ఘనంగా జరిపారు.



అబ్బనగూడవల్లిలో సీతారాముల కల్యాణోత్సవం

- చుండూరు ఏప్రిల్ 17 : మండల పరిధి ఆలపాడు, చుండూరు, మండూరు, మోదుకూరు, నడిగడ్డపాలెం గ్రామాల్లో శ్రీరామ నవమి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. భద్రాద్రి రాముని కల్యాణం నిర్వహించే సమయంలో ప్రతి ఒక్క రూ వారి వారి గ్రామాల్లో రామక కల్యాణాన్ని జరిపారు.
- భట్టిప్రోలు, ఏప్రిల్ 17: మండలంలోని రామమందిరాల్లో సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. సీతారామ కల్యాణాన్ని జరిపించేందుకు ఆయా గ్రామాల్లోని రామమందిరాలు, గ్రామ పధాన కూడళ్ళల్లో చలువ పందిళ్ళు, షామియానాలను ఏర్పాటు చేయించారు నిర్వాహకులు. బుధవారం ఉదయం ఆయా గ్రామాల్లో స్వామి వార్ల చిత్రపటాలు, ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి దేవాలయాల ఆవరణల్లో భజన బృందాల ఆధ్వర్యంలో భజనా కార్యక్రమాలు జరిగాయి.
- కొల్లూరు, ఏప్రిల్ 17: సీతారాముల కల్యాణ మహోత్సవాలు వాడవాడలా వైభవంగా నిర్వహించారు. బుధవారం కొల్లూరుతో పాటు పలు గ్రామాల్లో రామాలయాలు, మందిరాల్లో సీతారాము ల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. భక్తులకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు.



కొల్లూరు ఉత్తరపు వీధిలోని రామ మందిరంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వీరదాసు దంపతులు

- అమృతలూరు, ఏప్రిల్ 17 : మండల పరిధిలోని గ్రామాల్లో శ్రీసీతారాములు కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని శ్రీరామమందిరాల వద్ద చలువ పందిళ్లు వేసి సీతారాముల కల్యాణం జరిపారు. భక్తులకు పానకం, తీర్థ ప్రసాదాలను అందించారు.
- కర్లపాలెం, ఏప్రిల్ 17 : మండలంలోని గ్రామ గ్రామాన శ్రీరామ నవమి ఉత్సవాలు బుధవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. కర్లపాలెం మండల కేంద్రంలోని బంగారురెడ్డిపాలెంలోని శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో నిర్వహించిన వేడుకల్లో కావూరి శ్రీనివాసరెడ్డి, రాజోలు కొండలరెడ్డి దంపతులు కల్యాణ పీటల మీద కూర్చున్నారు. గ్రామ పెద్దలు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అమ్మవారికి శ్రీనివాసరెడ్డి, షకీనా దంపతులు రెండు సవర్ల బంగారు గొలుసును కానుకగా ఇచ్చారు. పాపిరెడ్డిపాలెంలో జరిగిన వేడుకల్లో జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి దంపతులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



బంగారురెడ్డిపాలెంలో శ్రీ సీతారాముల వారికి పూజలు చేస్తున్న భక్తులు

నేడు లంక గ్రామాల్లో ఆనందబాబు ప్రచారం

కొల్లూరు, ఏప్రిల్ 17: లంక గ్రామాల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు ప్రచారం నిర్వహించనున్నట్లు టీడీపీ మం డల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ బుధవారం తెలిపారు. గురువారం ఉదయం 8గంటలకు మండల పరిధిలోని జువ్వలపాలెం లో ఎన్నికల ప్రచారంలో ఆనందబాబు పాల్గొంటారని, అక్కడ నుంచి తడికలపూడి, కిష్కిందపాలెం గ్రామాల్లో ప్రచారం నిర్వహి స్తారు. భోజన విరామం అనంతరం సాయంత్రం 4గంటలకు మళ్లీ తిరిగి ఎన్నికల ప్రచారాన్ని తిప్పలకట్ట, తోకలవానిపాలెం, పోతార్లంక గ్రామాల్లో జరుగుతుందని మైనేని తెలిపారు. ఎన్నికల ప్రచారానికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో పాటు అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

రేపల్లె, ఏప్రిల్ 17: నగరం మండలం అక్కిలేరు కాలువలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని నగరం ఎస్ఐ కోటేశ్వ రరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సుమారు 30 నుంచి 40 సంవత్సరాల మధ్య గల గుర్తు తెలియని శవాన్ని గుర్తించామన్నారు. అతడు 5.5 అడుగల ఎత్తు, పెంచ్ గడ్డం కలిగి సిమెంట్ కలర్ కాటన్ ప్యాయింట్ ఎరుపు, నలుపు రంగు గళ్ళ చొక్క నలుపు రంగు కాటన్ బెల్టు ధరించి యున్నాడు. మృతుడి వివరాలు తెలిసిన వారు 99440 900877, 94407 96166లకు సమాచారం అందించాలని కోరారు.

కుల మతాలను రెచ్చగొడుతున్న అశోక్‌బాబు

- ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి సుబ్బారావు

అమృతలూరు, ఏప్రిల్ 17 : వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు ఎన్నికల ప్రచారంలో భాగంగా కులమతాల మధ్య చిచ్చులు పెడుతున్నాడని బాపట్ల పార్లమెంటరీ ఎస్సీ సెల్ అధికార పాములపాటి వెంకటసుబ్బారావు ఆరోపించారు. ఇంటూరు గ్రామంలో అశోక్‌బాబు విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడారన్నారు. ఎక్కడి నుండో వచ్చి ఇక్కడ రాజకీయం కోసం కులమతాల మధ్య చిచ్చుపెట్టడం మంచిది కాదని, గ్రామంలో తామంతా సోదరభావంతో ఉంటున్నామని సుబ్బారావు అన్నారు. గ్రామంలో నీటి సమస్యను అధికారంలోకి రాగానే తీర్చుస్తామని చెప్పడంపై ఆగ్రహం వ్యక్త పరిచారు. ప్రస్తుతం అధికారంలో ఉన్నది ఏ పార్టీ అని, మీరు అధికార పార్టీకి చెందిన వారు కాదా అని ప్రశ్నించారు. సమాజంలో ఏ పార్టీ వారైనా ఓట్లు అడగవచ్చని కాని ఎన్నడూ లేని విధంగా కులాలను రెచ్చగొట్టడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు.

పేకాట స్థావరంపై దాడి

కర్లపాలెం, ఏప్రిల్ 17 : మండలంలోని పేకాట స్థావరంపై పోలీసులు బుధవారం మెరుపు దాడి చేశారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 57 వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పట్టుబడిన వారిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, నాయకులు ఉన్నట్లు సమాచారం.

ఐదేళ్ల దుష్ట పాలనను సాగనంపుదాం

- ఎమ్మెల్యే అనగానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలి

రేపల్లె, ఏప్రిల్ 17: రాష్ట్రంలో ఐదేళ్ళ జగన్ దుష్ట పాలనను ఓటు హక్కు ద్వారా సాగనంపుదామని ఎమ్మెల్యే సోదరుడు అన గాని శివప్రసాద్ అన్నారు. బుధవారం పట్టణంలోని 22, 23, 24, 25వార్డుల్లో ఎమ్మెల్యే అనగాని గెలుపు కోసం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణం లో సమృద్ధిగా తాగునీరు అందించలేని ఈ ప్రభుత్వం ప్రజలకు ఏం మేలు చేస్తారని ప్రశ్నించారు. ఐదేళ్లుగా ప్రజలపై బాదుడే బాదుడు అన్నట్లుగా తొమ్మిదిసార్లు కరంటు చార్జీలు పెంచారు. పెట్రోల్, డీజిల్ రేట్లు, ఆర్టీసీ, పన్నులు పెంచి పేద, మధ్యతరగతి కుటుంబాలపై అధిక భారం మోపారన్నారు. ఎన్డీఏ కూటమి కలిసి రావటంతో జగన్‌కు నిద్ర పట్టడం లేదన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి కేంద్ర సహకారం అవసరమని రాష్ట్రాన్ని పునర్నిర్మించుకోవాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ అధికారంలోకి రావాలన్నారు. ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ గతంలో పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశారని, రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అనగాని, ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌కు అండగా నిలిచి విజయం చేకూర్చేలా కృషి చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పంతా ని మురళీధరరావు, గూడపాటి శ్రీనివాసరావు, యార్లగడ్డ చిన్నబాబు, గోగినేని పట్టాభిరామారావు, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, గుర్రం మురహరిరావు, ల్యాబ్ కిషోర్, డొక్కు గోపి, జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం, జనసేన నాయకులు రాసంశెట్టి మహేష్, దేవగిరి శంకర్, పి.లక్ష్మీనరసింహ, యలవర్తి లక్ష్మీ, దున్నా జయప్రద, టి.గౌరీరామకుమారి తదితరులు పాల్గొన్నారు.



రేపల్లెలోని 23, 24 వార్డుల్లో కరపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే సోదరుడు అనగాని శివప్రసాద్

కూటమి అభ్యర్థులను గెలిపించండి : ముమ్మనేని

భట్టిప్రోలు, ఏప్రిల్ 17: కూటమి అభ్యర్థులను గెలిపించడం ద్వారానే రాష్ట్రం అభివృద్ధి సాధించగలుగుతుందని మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య అన్నారు. మండలంలోని ఓలే రు గ్రామంలో బుధవారం మాజీ మంత్రి నక్కా ఆనందబాబు తనయుడు డాక్టర్ నక్కా అఖిలేశ్‌తో కలసి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద వర్గాల సంక్షేమం కోసమే అన్న ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారన్నారు. ఆయన లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పని చేస్తున్నారని ఆయన తెలియజేశారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నక్కా ఆనందబాబు, ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌లను గెలిపించాలని వెంకటసుబ్బయ్య ఓటర్లను అభ్య ర్థించారు. నక్కా అఖిలేశ్ తన తండ్రిని గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ గడపగడపకు ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మండ ల కన్వీనర్ వాకా శేషుబాబు, టీడీపీ నాయకులు మోటూరు పుణ్య శ్రీనివాసరావు, వాకా శ్రీనివాసరావు, పరుచూరి రమేష్, వేములపల్లి జగన్నాథరావు, మల్లికార్జునరావు, భాస్కరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



భట్టిప్రోలు మండలంలోని ఓలేరులో జరిగిన ప్రచారంలో పాల్గొన్న డాక్టర్ అఖిలేశ్

ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌ను గెలిపించండి

- మాజీ మంత్రి శమంతకమణి

వేమూరు, ఏప్రిల్ 17 : బాపట్ల ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉన్న కూటమి అభ్యర్థి కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని మాజీ మంత్రి శమంతకమణి, మాజీ చీఫ్‌విప్ యామినీ బాల కోరారు. బుధవారం మండలంలోని జంపని గ్రామంలో ఇద్దరూ టీడీపీ శ్రేణులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ ఉన్నత విద్యార్హత కలిగి సేవా దృక్పథంతో చంద్రబాబునాయుడును స్ఫూర్తిగా తీసుకుని కృష్ణప్రసాద్ రాజకీయాల్లోకి వచ్చారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు విషయంలో కృష్ణప్రసాద్ తమ వంతు పాత్ర పోషించారన్నారు. రానున్న ఎన్నికల్లో బాపట్ల పార్లమెంట్ అభ్యర్థిగా నిలబడ్డారని, ఆయనతో పాటుగా అసెంబ్లీ అభ్యర్థిగా బరిలో ఉన్న నక్కా ఆనందబాబును అఖం డ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల సహకారం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ హనీఫ్, వట్టిప్రోలు ఏబు, గవిని లక్ష్మీదుర్గ, నాదెళ్ళ సురేష్‌బాబు, వేల్పుల రవి, పల్లా వాసుదేవరాయుడు, మన్నే లక్ష్మీ, కొడాలి వెంకట్రావు, మన్నే శ్రీనివాస్, ముద్రబోయిన నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.



జంపనిలో టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శమంతకమణి, మాజీ చీఫ్‌విప్ యామినీ బాల

నామినేషన్లకు సర్వం సిద్ధం

- ఎన్నికల అధికారి హేలా షారాన్



హేలా షారాన్

రేపల్లె, ఏప్రిల్ 17: సార్వత్రిక ఎన్నికల్లో వివిధ పార్టీల అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్డీవో హేలా షారాన్ అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో నియోకజవర్గ అసెంబ్లీ స్థానాలకు ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారని తెలిపారు. 21వతేదీ ఆదివారం కావడం తో నామినేషన్లు విరామం ఉన్నట్లు తెలిపారు. అసెంబ్లీ అభ్యర్థులు రూ.10వేలు సెక్యూరిటీగా డిపాజిట్లు చెయ్యాలన్నారు. నామినేష న్లు వెయ్యటానికి ఆర్వోల దగ్గరకు వచ్చే అభ్యర్థి తనతో పాటు మరో నలుగురికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ఉదయం 11నుంచి సాయంత్రం 3గంటల వరకు అభ్యర్థులు నామినేషన్ చేసుకోవచ్చని సూచించారు. ఆర్వో కార్యాలయం వద్ద నామినేషన్ల ప్రక్రియలో వీడియోలు సీసీ కెమోరాలు నిఘా ఉంటుందని తెలిపారు.

మొక్కజొన్న బస్తాలు దొంగిలించారంటూ కౌలు రైతు ఆవేదన

భట్టిప్రోలు, ఏప్రిల్ 17 : మండలంలోని చింతమోటు గ్రామానికి చెందిన కౌలు రైతు తన పంట పొలంలో నిల్వ ఉంచిన 10 మొక్కజొన్న బస్తాలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారం టూ ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు రైతు తెలిపిన వివరాల ప్రకా రం మండలంలోని వెల్లటూరు చిన్నరేవు పరిధిలో చింతమోటు గ్రామానికి చెందిన శొంఠి శ్రీనివాసరావు పొలం కౌలుకు తీసుకు ని మొక్కజొన్నను సాగు చేశానన్నారు. ఈనెల 11వ తేదీన మొ క్కజొన్న కోతకు రావడంతో కోత కోసి కాటా వేసి బస్తాలను పంట పొలంలో నిల్వ ఉంచానన్నారు. మరుసటి రోజు వచ్చి చూసేసరికి 10బస్తాలు తగ్గినట్టు గుర్తించానన్నారు.

పది బస్తాలు దొంగతనం జరిగినట్లుగా ఈనెల 13న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలియజేశారు. పోలీసులు పట్టించుకోకపోగా బస్తాలకు కాపలా ఉండకుండా ఏం చేస్తున్నావంటూ నిలదీశారని, మమ్మల్ని ఏమి చేయమంటావు అంటూ ఎస్ఐ శ్రీనివాసరావు నిర్లక్ష్యంగా వ్యవహరించారని కౌలు రైతు శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుల తీరుతో ఖంగుతిన్నానని దొంగతనం జరిగిందని చెబితే విచారించాల్సిన పోలీసులు ఈ విధంగా వ్యవహరించడం బాధగా ఉందని రైతు శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. తనకు న్యాయం చేయాలంటూ పోలీసులను వేడుకుంటున్నాడు.




మళ్లీ.. మళ్లీ గెలిచారు

- వరుస విజయాలు.. వారి సొంతం
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో కోడెలదే రికార్డు
- ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక
- మిగిలిన ముగ్గురు ఐదుసార్లు..


డాక్టర్ కోడెల శివప్రసాదరావు


కన్నా లక్ష్మీనారాయణ


ధూళిపాళ్ల నరేంద్ర


డాక్టర్ మాకినేని పెదరత్తయ్య

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎన్నికల రణక్షేత్రంలో వారికంటూ ఓ ప్రత్యేకత ఉంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎక్కువసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది రికార్డు సృష్టించారు. వరుస విజయాలను వారు సొంతం చేసుకున్నారు. నవ్య ఆంధ్రప్రదేశ్ తొలి శాసనసభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఆరుసార్లు, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, మాజీ మంత్రి డాక్టర్ మాకినేని పెదరత్తయ్య, ధూళిపాళ్ల నరేంద్ర వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించి రికార్డు సృష్టించారు.

● డాక్టర్ కోడెల శివప్రసాదరావు తెలుగుదేశం ఆవిర్భావంతో ఆయన రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. కాంగ్రెస్, కాసు కుటుంబ కంచుకోట నరసరావుపేటను బద్దలుకొట్టారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే అత్యధికసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన నేతగా కోడెల రికార్డు నెలకొల్పారు. 1983 ఎన్నికల్లో తొలిసారిగా ఎమ్మెల్యేగా పోటీచేసి కోడెల విజయం సాధించారు. 1985, 1989, 1994, 1999 ఎన్నికల్లో కోడెల తన విజయయాత్రను కొనసాగించారు. వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన కోడెల పలు మంత్రి పదవులను నిర్వహించారు. 2004, 2009 ఎన్నికల్లో నరసరావుపేట నుంచి పోటీ చేసి ఓటమిని చవిచూసిన కోడెల 2014 ఎన్నికల్లో సత్తెనపల్లి నియోజక వర్గం నుంచి పోటీచేసి ఆరవసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన కోడెల నవ్య ఆంధ్రప్రదేశ్‌కు తొలి స్పీకర్‌గా కోడెల పనిచేశారు. 2019 ఎన్నికల్లో సత్తెనపల్లి నుంచి తిరిగి పోటీ చేసిన కోడెల ఓటమి చెందారు. ఆయన 2019 సెప్టెంబర్ నెలలో మృతిచెందారు. మొత్తం తొమ్మిదిసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసిన కోడెల ఆరుసార్లు విజయం సాధించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో తొమ్మిదిసార్లు ఎమ్మెల్యేగా పోటీచేసే అరుదైన అవకాశం ఒక్క కోడెలకు మాత్రమే దక్కింది. రెండు దశాబ్దాలపాటు ఉమ్మడి గుంటూరు జిల్లా రాజకీయాలను శాసించారు.

● మాజీ మంత్రి, సత్తెనపల్లి తెలుగుదేశం అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ కూడా వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. పెదకూరపాడు నియోజకవర్గం నుంచి కన్నా 1989, 1994, 1999, 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 2009 ఎన్నికల్లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగారు. వరుసగా ఐదోసారి విజయాన్ని సొంతం చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కన్నా పలు కీలక మంత్రి పదవులను అలంకరించారు. 2014లో గుంటూరు పశ్చిమ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఆ తదుపరి కన్నా బీజేపీలో చేరి ఆ పార్టీ అభ్యర్థిగా నరసరావుపేట పార్లమెంట్‌కు 2019లో పోటీ చేసిన కన్నా ఓటమి పాలయ్యారు. 2023లో తెలుగుదేశం పార్టీలో చేరిన కన్నా సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి ఏడోసారి 2024లో అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.

● డాక్టర్ మాకినేని పెదరత్తయ్య తెలుగుదేశం ఆవిర్భావంతో రాజకీయాల్లోకి వచ్చారు. 1983లో ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి తొలిసారి పోటీచేసి గెలుపొందారు. ఆ తరుపరి జరిగిన నాలుగు ఎన్నికల్లో కూడా వెనుదిరిగి చూడలేదు. 1985, 1989, 1994, 1999 ఎన్నికల్లో విజయం సాధించిన రత్తయ్య జలవనరుల శాఖ మంత్రిగా పనిచేశారు. 2004లో ఓటమి పాలయ్యారు. 2006లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో ప్రత్తిపాడు నియోజకవర్గంను ఎస్సీ రిజర్వ్ చేశారు. దీంతో రత్తయ్య ప్రత్తిపాడు నుంచి పోటీ చేసే అవకాశాన్ని కోల్పోయారు.

● సంగం డెయిరీ చైర్మన్‌గా గుర్తింపు పొందిన మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కూడా పొన్నూరు నియోజకవర్గం నుంచి వరుసగా ఐదుసార్లు విజయం సాధించారు. అయన తండ్రి ధూళిపాళ్ల వీరయ్య చౌదరి కూడా ఇదే నియోజకవర్గంకు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. కాగా వీరయ్య చౌదరి మరణంతో 1994లో జరిగిన ఎన్నికల్లో నరేంద్రకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం తెలుగుదేశం పార్టీ కల్పించింది. 1994, 1999, 2004, 2009, 2014 ఎన్నికల్లో వరుసగా ఐదుసార్లు శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు. 2019లో జరిగిన ఎన్నికల్లో పోటీచేసిన నరేంద్ర ఓటమిని చవిచూశారు. దీంతో అయనకు డబుల్ హ్యాట్రిక్ విజయం మిస్ అయింది. జరగనున్న ఎన్నికల్లో పొన్నూరు నుంచి టీడీపీ అభ్యర్థిగా నరేంద్ర ఏడోసారి బరిలోకి దిగారు.

నేడు నారా లోకేశ్ నామినేషన్

- లోకేశ్ తరపున నామినేషన్ దాఖలు చేయనున్న ఉమ్మడి పార్టీల నేతలు
- తొలుత సీతారామస్వామి కోవెలలో ప్రత్యేక పూజలు
- భారీ ర్యాలీగా వెళ్లి నామినేషన్ పత్రాలు సమర్పించనున్న నేతలు


సమావేశంలో మాట్లాడుతున్న నందం అబద్దయ్య, చిల్లపల్లి శ్రీనివాసరావు

మంగళగిరి, మంగళగిరి సిటీ, ఏప్రిల్17: టీడీపీ, జనసేన, బీజేపీ బలపరిచిన మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థి నారా లోకేశ్ తరఫున మూడు పార్టీల నేతలు గురువారం ఉదయం నామినేషన్ దాఖలు చేయనున్నారు. మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు విలేకర్లకు వివరాలు వెల్లడించారు. అబద్దయ్య మాట్లాడుతూ తొలుత గురువారం ఉదయం పాతమంగళగిరి సీతారామస్వామి కోవెలలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అక్కడి నుంచి భారీ ర్యాలీగా మిద్దె సెంటరు, వైష్ణవి కల్యాణ మండపం, పాతబస్టాండు మీదుగా ఎంటీఎంసీ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి లోకేశ్ తరఫున కూటమి నేతలు రెండు సెట్ల నామినేషన్ పత్రాలు సమర్పిస్తారని తెలిపారు. చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో నష్టపోయిన అమరావతి రాజధాని రైతులు, నిరుద్యోగులు, చేనేత వర్గాల ప్రజలు, మహిళలు స్వచ్ఛందంగా తరలివచ్చి నామినేషన్ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, మండల అధ్యక్షుడు తోట పార్థసారథి, దుగ్గిరాల మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, జనసేన ఎంటీఎంసీ అధ్యక్షుడు మునగపాటి వెంకట మారుతీరావు, ఆయా పార్టీ నేతలు జంజనం వెంకట సాంబశివరావు, శివనాగేశ్వరరావు, పసుపులేటి శ్రీనివాసరావు, షేక్ రియాజ్, అమరా సుబ్బారావు, వేమూరి మైనర్‌బాబు, గోవాడ దుర్గారావు, మల్లవరపు వెంకట్, దాసరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరిలోనూ కుప్పం సంప్రదాయమే!

కుప్పం సంప్రదాయమే ఇకపై మంగళగిరిలో కూడ అమలుచేయాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నిర్ణయించారు. మంగళగిరిని తన సొంత నియోజకవర్గంగా భావిస్తున్న లోకేశ్.. నామినేషన్ వేసే వ్యవహారంలోనూ తన తండ్రి చంద్రబాబునాయుడు బాటలోనే పయనించాలని తీర్మానించుకున్నారు. కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబు తరఫున స్థానిక పార్టీ నాయకుల ఆధ్వర్యంలోనే నామినేషన్ పత్రాలను దాఖలు చేయడం ఓ ఆనవాయితీగా కొనసాగుతూ వస్తుంది. అదే సంప్రదాయాన్ని లోకేశ్ కూడ అనుసరించనున్నారు. మధ్యాహ్నం 2:34 నిమిషాలకు ఎంటీఎంసి కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను కూటమి నాయకులు సమర్పిస్తారు. ఈ ఘట్టానికి తనతోపాటు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, బీజేపీ నియోజకవర్గ సమన్వయకర్త పంచుమర్తి ప్రసాద్ నేతృత్వం వహిస్తారని అబద్దయ్య తెలిపారు.

209 . REPALLE ASSEMBLY SEGMENT



తీరప్రాంతంలోని రేపల్లె నియోజకవర్గం కమ్యూనిస్టులకు కంచుకోటగా ఉండేది. పేదలు, రైతుల పక్షాన కమ్యూనిస్టు నాయకులు పోరాటాలు చేసి పదుల సంఖ్యలో అశువులు బాశారు. వేలాదిమంది కళాకారులను తీర్చిదిద్ది కళామాతల్లి ముద్దు బిడ్డగా రేపల్లె నిలిచింది. జిల్లాలో సముద్ర తీరప్రాంతంలోని రేపల్లె నియోజకవర్గంలో ఒకసారి ఎమ్మెల్యే అయిన వారు రెండుమూడు సార్లు ఎమ్మెల్యేగా కొనసాగుతూ వస్తున్నారు. రాజకీయంగా ఎంతో చైతన్యం కలిగిన తీరప్రాంతంలోని నాయకులు జిల్లా, రాష్ట్రస్థాయి వరకు రాజకీయాలు కొనసాగించారు. 1955 నుంచి 2019 వరకు రేపల్లె నియోజకవర్గంలో 14 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా సీపీఐ, సీపీఎం ఒక్కొక్కసారి గెలుపొందగా, కాంగ్రెస్ ఆరుసార్లు, టీడీపీ ఐదుసార్లు, ఇండిపెండెంట్ అభ్యర్థి ఒకసారి గెలుపొందారు.

తీరం.. చైతన్యం

- నాడు కమ్యూనిస్టుల కంచుకోట రేపల్లె నియోజకవర్గం
- నేడు బీసీలకు పెద్దపీట
- మత్స్య సంపదకు కేంద్రం
- చేనేత రంగంలో రాణింపు
- నిజాంపట్నం హార్బర్‌కు మడ అడవుల రక్షణ రేఖ
- నియోజకవర్గంలో 2,26,591 లక్షల ఓట్లు
- మహిళా ఓటర్లే ఆధిక్యం

రేపల్లె, ఏప్రిల్ 17: రేపల్లె నియోజకవర్గం సముద్రం ఒడ్డున ఉంది. దీంతో మత్స్య సంపదకు కేంద్రంగా ఈప్రాంతం ఘనత సాధించిం ది. రొయ్యలు, చేపలు, పీతలు ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతి చెయ్యడంతో కోట్ల రూపాయల సంపద మన రాష్ట్రానికి వస్తుంది. రేపల్లె నియోజకవర్గంలో 25వేల ఎకరాల్లో రొయ్యల సాగు జరుగుతుంది. మత్స్య సంపద జీవనంపై వేలాది మంది ప్రజలు ఉపాధి పొందుతున్నారు. రాష్ట్రానికి అధిక సంపాదన మత్స్యసంపదలు కల్పించటంలో ముందంజలో ఉంది.

చేనేత వస్త్రాలకు పేటేరు ప్రసిద్ధి..

చేనేత వస్త్రాలకు తీరప్రాంతంలో ప్రసిద్ధిగాంచింది. వేలాది మంది నేతన్నలు వస్త్రాలు నేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలోని పేటేరు చీరలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడ తయారు చేసిన చేనేత వస్త్రాలు దేశ వ్యాప్తంగా రవాణా అవుతాయి. నియోజకవర్గంలోని రేపల్లె, పేటేరు, రాజవోలు, చెరుకుపల్లి, గ్రామాల్లో చేనేతకు ప్రత్యేక గుర్తింపు ఉంది. వేలాది మగ్గాలతో చేనేత రంగంలో రాణిస్తూ అధునాతన వస్త్రాల తయారీలో పేరు గాంచింది.

రెండుకులాల ఆధిపత్యం..



రేపల్లె నియోజకవర్గంలో అత్యధిక ఓట్లు కలిగిన గౌడ, కాపు సామాజిక వర్గానికి చెందిన ఓట్లు 85 వేల పైచిలుకే ఉన్నాయి. డీ లిమిటేషన్‌కు ముందు కూచినపూడిలో బీసీ అభ్యర్థులు, రేపల్లెలో ఓసీ అభ్యర్థులు గెలుపొందారు. డీ లిమిటేషన్‌లో కూచినపూడి అసెంబ్లీ స్థానం రద్దు కావడంతో రేపల్లె స్థానంలో బీసీ అభ్యర్థులను ఆయా పార్టీలు ఎంపిక చేస్తున్నాయి. గతంలో బీసీ మత్స్యకార వర్గానికి చెందిన మోపిదేవి వెంకట రమణారావు 2009లో విజయం సాధించగా, బీసీ గౌడ వర్గానికి చెందిన అనగాని సత్యప్రసాద్ 2014, 2019లో గెలుపొందారు. అత్యధికంగా బీసీలు ఉన్న ప్రాంతం కావడంతో బీసీ కోటా కింద ఈ నియోజకవర్గాన్ని ప్రత్యేకంగా కేటాయిస్తున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా అనగాని సత్యప్రసాద్ పోటీ చేస్తుండగా, వైసీపీ నుంచి గౌడ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ ఈవూరి గణేష్ పోటీలో ఉన్నారు.

సముద్రపు వెంబటి రక్షణ రేఖగా ఉన్న ఏపుగా పెరిగిన మడ అడవులు





రేపల్లె నియోజకవర్గంలో గత విజయాలు..

నియోజకవర్గంలో మొట్టమొదటి సారిగా 1955లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ, సీపీఐలు తలపడగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి యడం చెన్నయ్య విజయం సాధించారు. 1962లో సీపీఐ, కాంగ్రెస్ పార్టీలు తలపడగా సీపీఐ అభ్యర్థి కొరటాల సత్యనారాయణ గెలుపొందారు. 1967లో కాంగ్రెస్, సీపీయం తలపడగా కాంగ్రెస్ అభ్యర్థి యడం చెన్నయ్య గెలుపొందారు. 1972లో కాంగ్రెస్, ఇండిపెండెంట్ అభ్యర్థిగా మైనేని సీతారామయ్య తలపడగా యడం చెన్నయ్య విజయం సాధించారు. 1978లో సీపీఎం, ఇండిపెండెంట్ అభ్యర్థిగా యడం చెన్నయ్య పోటీ పడగా కొరటాల సత్యనారాయణ విజయకేతనం ఎగురవేశారు. 1983లో ఇండిపెండెంట్, కాంగ్రెస్ పార్టీలు తలపడగా ఇండిపెండెంట్ అభ్యర్థి యడ్ల వెంకట్రావు గెలుపొందారు. 1985లో టీడీపీ, కాంగ్రెస్ అభ్యర్థిగా కంఠంనేని రాజేంద్రప్రసాద్ పోటీపడగా యడ్ల వెంకట్రావు టీడీపీ తరఫున విజయం సాధించారు. 1989లో కాంగ్రెస్ తరఫున అంబటి రాంబాబు, టీడీపీ తరఫున ముమ్మనేని వెంకట సుబ్బయ్య పోటీ చేయగా అంబటి రాంబాబు విజయం సాధించారు. 1994లో కాంగ్రెస్ అభ్యర్థి అంబటి రాంబాబు, టీడీపీ అభ్యర్థిగా ముమ్మనేని వెంకట సుబ్బయ్య విజయం సాధించారు. 1999లో అంబటి రాంబాబు తలపడగా ముమ్మనేని వెంకటసుబ్బయ్య టీడీపీ తరఫున విజయం సాధించారు. 2004లో టీడీపీ తరఫున ముమ్మనేని వెంకట సుబ్బయ్య పోటీ చేయగా, కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన దేవినేని మల్లికార్జునరావు విజయం సాధించారు. 2009లో కాంగ్రెస్ తరఫున మోపిదేవి వెంకట రమణారావు, టీడీపీ తరఫున అనగాని సత్యప్రసాద్ పోటీపడగా మోపిదేవి వెంకట రమణారావు విజయం సాధించారు. 2014లో టీడీపీ తరఫున అనగాని సత్యప్రసాద్, కాంగ్రెస్ తరఫున మోపిదేవి వెంకట రమణరావు పోటీ చేయగా అనగాని సత్యప్రసాద్ గెలుపొందారు. 2019లో టీడీపీ తరఫున అనగాని సత్యప్రసాద్, వైసీపీ తరపున మోపిదేవి వెంకటరమణారావు పోటీ చేయగా అనగాని సత్యప్రసాద్ గెలుపొందారు.

గెలుపును శాసించేది మహిళల ఓట్లే..

నియోజకవర్గంలోని గెలుపు, ఓటములను శాసించేది మహిళలే. రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల్లో పురుషుల ఓట్ల కంటే మహిళల ఓట్లే కీలకంగా ఉన్నాయి. జిల్లాలో ఎక్కడా లేనివిధంగా మహిళల ఓట్లు అధికం కావడంతో నియోజకవర్గంలో వారు ప్రధానపాత్ర పోషించనున్నారు. నియోజకవర్గంలోని మొత్తం 2,26,591 ఓట్లు ఉండగా వాటిలో పురుషులు 1,11,091, మహిళ 1,15,480 ఓట్లుగా ఉన్నాయి.

నిజాంపట్నం హార్బర్‌లో మత్స్య సంపద..

తీరప్రాంతంలోని రేపల్లె నియోజకవర్గంలో నిజాంపట్నం హార్బర్ ఉంది. ఇక్కడ మత్స్యకారులు పెద్దసంఖ్యలో చేపల వేట చేస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. చిన్నవి, పెద్దవి బోట్లు వెయ్యికి పైగానే ఉన్నాయి. మూడు వేల కుటుంబాలు వేట చేస్తూ తీసుకు వచ్చిన మత్స్య సంపదను ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. నిజాంపట్నం హార్బర్ నుంచి లంకేవాని దిబ్బ సముద్రపు ఒడ్డు వరకు సుమారు 22 కిలోమీటర్ల మేర మడ అడవులు విస్తారంగా ఉన్నాయి. తీరప్రాంతానికి తుఫాన్లు, ఉప్పెనలు సంభవించే సమయంలో మడ అడవులు అడ్డుగోడగా ఉంటూ విపత్తులు జరగకుండా కాపాడుతున్నాయి.

పురుషులు	110740
మహిళలు	114940
ట్రాన్స్ జెండర్	25
కులం	**జనాభా**
గౌడ	42000
కాపు	38000
మాల	25000
మాదిగ	13000
కమ్మ	13000
అగ్నికుల క్షత్రియ	17000
ఎరుకల, యానాది	10000
రెడ్డి	13000
యాదవ	13000
ముస్లిం	12500
ఆర్యవైశ్యులు	11000
పద్మశాలి	9500
రజక	3000
విశ్వబ్రాహ్మణ	800
నాయీబ్రాహ్మణ	1200
కుమ్మరి	600
ముదిరాజు	200
గానర, సవర	200
బ్రాహ్మణ	1500
మొత్తం ఓటర్లు	2,25,705

నియోజకవర్గం ప్రొఫైల్

నియోజకవర్గం పేరు:	రేపల్లె
ఏ జిల్లాలో ఉంది:	బాపట్ల జిల్లా
మండలాలు :	రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాలు
ప్రస్తుత ఎమ్మెల్యే:	అనగాని సత్యప్రసాద్, టీడీపీ


తీరంలో మత్స్య సంపద

నామినేషన్లు షురూ

- ఒక అభ్యర్థి రెండు స్థానాల్లో మాత్రమే పోటీకి అవకాశం



గుంటూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ/శాసనసభ స్థానాల్లో రెండు చోట్ల మాత్రమే ఒక అభ్యర్థి పోటీ చేసేందుకు అవకాశం ఉంటుంది. అంతకుమించి పోటీ చేయడానికి అనుమతి లేదు. పోటీ చేసే అభ్యర్థులు పార్లమెంటుకు రూ.25,000, అసెంబ్లీకి రూ.10,000 ధరావతు చెల్లించాల్సి ఉంటుంది. ఎస్సి, ఎస్టి అభ్యర్థులు దీనిలో 50 శాతం చెల్లిస్తే సరిపోతుంది. అభ్యర్థులు నామినేషన్ల దాఖలకు 13 రకాల డాక్యుమెంట్లను తీసుకురాలి. పార్లమెంటుకు పోటీచేసే అభ్యర్థులు ఫారమ్ 2ఏ, అసెంబ్లీకి పోటీ చేసేవారు ఫారమ్ 2బిలో దరఖాస్తు చేయాలి. నామినేషన్లను ఆర్ఓ/సంబంధిత ఏఆర్ఓకు మాత్రమే సమర్పించాలి. అభ్యర్థి తన నామినేషన్‌ను నేరుగా/తన ప్రపోజర్ ద్వారా సమర్పించవచ్చు. అభ్యర్థి నామినేషన్‌తో పాటు తమ పేరిట కొత్తగా తెరిచిన బ్యాంకు ఖాతా వివరాలను సమర్పించాలి. నామినేషన్ల స్వీకరణకు సంబంధించి ఒక హెల్ప్ డెస్కుని ప్రతీ చోటా ఏర్పాటు చేశారు. సువిధ యాప్ ద్వారా నామినేషన్లను దాఖలు చేసే అవకాశం ఉన్నప్పటికీ, వాటి కాపీలను భౌతికంగా ఆర్ఓకు అందజేయాల్సి ఉంటుంది. ఫారమ్-26 ద్వారా అభ్యర్థి తన అఫడవిట్‌ను సమర్పించాలి. ఫారమ్ 26 స్టాంప్ పేపర్ విలువ రూ. 10 లేదా అంతకంటే ఎక్కువ ఉండాలి. భౌతిక స్టాంప్ పేపర్ అందుబాటులో లేకుంటే ఈ-స్టాంప్ కూడా ఉపయోగించవచ్చు. అభ్యర్థి నామినేషన్ వేసిన దగ్గర నుంచీ, ఖర్చు అతని ఖాతాలో లెక్కించడం జరుగుతుంది. పత్రికల్లో వచ్చే ప్రకటనలు, పెయిడ్ న్యూస్ వార్తలను సైతం అభ్యర్థి ఖాతాలో లెక్కించడం జరుగుతుంది.

ఎన్నికల ప్రక్రియ షెడ్యూలు, ముఖ్యమైన తేదీలు

- గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసే తేదీ: 18 ఏప్రిల్ 2024 (గురువారం)
- గెజిట్ నోటిఫికేషన్ జారీ తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుంది.
- నామినేషన్లు వేయడానికి చివరి తేదీ: 25 ఏప్రిల్ 2024 (గురువారం)
- నామినేషన్ల పరిశీలన తేదీ: 26 ఏప్రిల్ 2024 (శుక్రవారం)
- అభ్యర్థుల ఉపసంహరణకు చివరి తేదీ: 29 ఏప్రిల్ 2024 (సోమవారం)
- పోల్ తేదీ: 13 మే 2024 (సోమవారం)
- కౌంటింగ్ తేదీ : 04 జూన్ 2024 (మంగళవారం)

వేమూరులో పోలింగ్ భళా

నియోజకవర్గంలో 80 శాతంపైనే నమోదు

వేమూరు, ఏప్రిల్ 17: వేమూరు నియోజకవర్గం పూర్తిగా గ్రామీణ ప్రాంతం. అయినా ఓటర్లలో చైతన్యం అధికం. ఇది ప్రతీ ఎన్నికల్లోనూ కనిపిస్తోంది. పోలింగ్ సరళి పరిశీలిస్తే 1955 నుంచి ప్రతీ ఎన్నికల్లోనూ మార్పులు ఉంటున్నాయి. 1955, 1962, 1967, 1972 ఎన్నికల్లో 77, 84, 75 శాతం పోలింగ్ నమోదైంది. అప్పటి వరకు నియోజకవర్గ ఓటర్లు లక్షలోపే. ఆ తర్వాత 1978 నుంచి నియోజకవర్గంలో ఓట్లు లక్ష దాటాయి. అక్కడి నుంచి 2019 వరకు జరిగిన ఎన్నికల్లో 78 నుంచి 87.52 శాతానికి పోలింగ్ పెరిగింది. 1994, 2004 ఎన్నికల సందర్భాల్లో కొంత వరకు ఓట్ల సంఖ్య తగ్గింది. అయినప్పటికీ ఓటింగ్ శాతం మాత్రం 74, 82.55 శాతంగా నమోదైంది.



వైభవంగా శ్రీరామ నవమి


కల్యాణ అలంకరణలో సీతారాములు

- మార్మోగిన రామ నామం
- మందిరాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు
- భారీ ఎత్తున అన్నదానం

చీరాలటౌన్, ఏప్రిల్ 17 : చీరాల పట్టణ, గ్రామీణంలో బుధవారం శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. అన్ని రామాలయాలు రామ నామంతో మార్మోగాయి. ఈపూరుపాలెం పద్మనాభునిపేట రామాలయంలో మేళ తాళాలతో నగరోత్సవం, అనంతరం శ్రీసీతారామ కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. పలుచోట్ల రామాంజనేయ యుద్ధం, గయోపాఖ్యానం, సత్య హరిచ్చంద్ర కాటి సీను నాటక ప్రదర్శనలు, కోలాట ప్రదర్శనలు జరిగాయి. చివరిగా స్వామివారి ఏకాంతసేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఇంకొల్లు : శ్రీరామనమి సందర్భంగా మండలంలో సీతారాముల కల్యాణ వేడుకలు వైభవంగా జరిగాయి. హరిహర ధార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో చెన్నకేశవ దేవాలయంలో రాములోరి కల్యాణాన్ని నిర్వహించగా భక్తులు చూసి తరించారు. వేలాది మందికి అన్నసంతర్పణ నిర్వహించారు. చెన్నకేశవ దేవాలయంలో రూ.లక్షతో తాటాకు పందిళ్లను ఏర్పాటు చేయగా, అర్ధరాత్రి 3 గంటలకు ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగి పందిరి దగ్ధమైంది. అన్ని రామమందిరాల్లో పూజలు నిర్వహించారు.

పర్చూరు : శ్రీరామ నవమిని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉప్పుటూరులోని శ్రీ కోనేటి ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీ సీతారాముల వారి కల్యాణోత్సవం నిర్వహించారు. వెంటక పిచ్చయ్య శాస్త్రి ఆధ్వర్యంలో వేద పండితులతో సీతారాముల కల్యాణం జరిపించారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్వామిఅమ్మవార్లను దర్శించుకొని పూజలు నిర్వహించారు. ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని పంటలు బాగా పండాలని ఈసందర్భంగా ఏలూరి కోరారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ నిర్వహకులు కాల్వ సత్యనారాయణ, గ్రామస్థుల సారథ్యంలో ఏర్పాట్లు చేశారు.

అలరించిన కూచిపూడి నృత్యం

ఆలయ ప్రాంగణంలో నృత్య శ్రీ నాట్య అకాడమీ వారి సారథ్యంలో ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. చిన్నారుల నృత్య ప్రదర్శన కార్యక్రమంలో ఏలూరి పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు.

మార్టూరు : శ్రీరామ నవమిని శ్రీరామ మందిరాల్లో కనులపండువగా నిర్వహించారు. సీతారాముల కల్యాణాన్ని భక్తులు తిలకించి తరించారు. తూర్పు, పడమర బజారు, యానాది కాలనీ, నేతాజీనగర్‌లో రాములోరికి పూజలు నిర్వహించారు. రాజుగారిపాలెంలో 20 జంటలు కూర్చొని కల్యాణాన్ని జరిపించారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. తాటివారిపాలెం, డేగరమూడి, కోలలపూడి, నాగరాజుపల్లిలో శ్రీరామ నవమి పూజలు నిర్వహించారు. యద్దనపూడి మండలంలోని గ్రామాలలో కోదండ రాముని మందిరాల్లో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. 35 జంటలు కల్యాణం నిమిత్తం కలశాలతో అర్చనలు నిర్వహించారు. యనమదల, అనంతవరం, పూనూరు తదితర గ్రామాలలో వడపప్పు, పానకం పంపిణీ చేశారు.


కూచిపూడి నృత్య కళాకారులతో ఎమ్మెల్యే ఏలూరి

కారంచేడు : శ్రీ రామనవమి వేడుకలను కారంచేడు మండలంలో వైభవంగా నిర్వహించారు. స్వామివార్ల విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. సీతారాముల కల్యాణం అనంతరం భక్తులకు పానకం, వడపప్పు పంపిణీ చేశారు. కారంచేడు, స్వర్ణ, కుంకలమర్రు గ్రామాల్లో సాస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కారంచేడులో శ్రీరామనవమి రోజున హస్వనృత్యం ఏర్పాటు సంప్రదాయానికి ప్రతీక.

అద్దంకిటౌన్ : శ్రీరామనవమి వేడుకను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శింగరకొండలోని సీతారామాలయం వద్ద జరిగిన వేడుకలలో డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు దంపతులు రాములోరి కల్యాణాన్ని జరిపించారు. గాజులపాలెం, బలిజపాలెం, గానుగపాలెం కాలనీలలోని ఆలయాల వద్ద, రామాటాకిస్ పక్క బజార్‌లో నవమి వేడుకలు జరిగాయి.

బల్లికురవ : మండలంలోన అన్ని గ్రామాలలో బుధవారం శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా జరిగాయి. రాములోరి మందిరాల్లో సీతారామల కల్యాణాన్ని తిలకించారు. గుంటుపల్లి, కొత్తపాలెం గ్రామాలలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

పంగులూరు : సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మండలంలోని పంగులూరు దళితవాడలోని రామ మందిరంలో నవమి వేడుకను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పంగులూరు, కశ్యాపురం. జాగర్లమూడివారిపాలెం, తక్కెళ్లపాడు, భగవాన్‌రాజుపాలెం, చందలూరులో వేడుకలు జరిగాయి.

చినగంజాం : సీతారాముల కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భావనారాయణస్వామి, వాసవీ మాత ఆలయం, పెదగంజాం, రామచంద్రానగర్, రాజుబంగారుపాలెం, సంతరావూరు, మోటుపల్లి, మూలగానివారిపాలెం, గొనసపూడి, చింతగుంపల్లి, సోపిరాల, పల్లెపాలెం తదితర గ్రామాల్లో శ్రీరామ నవమిని వైభవంగా నిర్వహించారు. కడవకుదురులో సీతాలక్ష్మణ హనుమత్ సమేత శ్రీకోదండరామస్వామి కల్యాణ ఘట్టాన్ని భక్తులు చూసి తరించారు.


పంగులూరులో కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు

మేదరమెట్ల : మండలంలోని రామాలయాల్లో చలువ పందిళ్లు ఏర్పాటు చేసి సీతారామ కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ధైవాలరావూరులోని చెన్నకేశవస్వామి ఆలయంలో రాములవారి కల్యాణం నిర్వహించారు. గ్రామస్థులు రాయిపాటి శ్రీనివాసరావు, త్రివేణి దంపతులు, ముమ్మన సుబ్బారావు దంపతులతో పాటు పదిమంది దంపతులు పాల్గొన్నారు. తూర్పుపాలెం రామాలయంలో స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. రావినూతల, పమిడిపాడు, బొడ్డువానిపాలెం తదితర గ్రామాల్లో నవమి వేడుకను పండువగా నిర్వహించారు. అన్ని చోట్లా కల్యాణం అనంతరం సీతారాముల విగ్రహాలతో రాత్రికి గ్రామోత్సవాలు నిర్వహించారు.


పూజల్లో పాల్గొన్న డీఎస్పీ దంపతులు

టీడీపీతోనే బీసీలకు ప్రత్యేక గుర్తింపు

జయహో బీసీలో కూటమి అభ్యర్థి గొట్టిపాటి

పంగులూరు, ఏప్రిల్ 17 : స్వర్గీయ ఎన్టీఆర్ నాలుగు దశాబ్దాల క్రితం తెలుగుదేశం పార్టీని స్థాపించి బీసీలకు ప్రత్యేక గుర్తింపు తెచ్చారని టీడీపీ కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని ముప్పవరం గ్రామంలో పార్టీ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం రాత్రి జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాపట్ల పార్లమెంటరీ పార్టీ న్యాయ విభాగ అధ్యక్షుడు బత్తుల రామకోటయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గొట్టిపాటి మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచే బడుగుబలహీనవర్గాల ప్రజలు అండగా ఉండగా, వారి అభ్యున్నతికి పార్టీ పాటుపడుతున్నదన్నారు. మళ్లీ చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వ పాలనలో బలహీనవర్గాలకు రక్షణతోపాటు సంక్షేమం ఉంటుందన్నారు. వైసీపీ పాలనలో బీసీలపై దాడులు పెరిగిన విషయం అందరికీ తెలుసునన్నారు. పార్టీ మారలేదన్న కారణంతోపాటు జగన్‌రెడ్డి పాలన వైఫల్యాలను ఎత్తిచూపిన 75 మంది బీసీ నేతలను హతమార్చారని గొట్టిపాటి ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి పార్టీలకు మద్దతు ఇవ్వండి.. మీకు అండగా కూటమి ఉంటుందన్నారు. జగన్‌రెడ్డి బీసీలకు కార్పొరేషన్, చైర్మన్ పదవులిచ్చి కుర్చీలకే పరిమితం చేశారని గొట్టిపాటి అన్నారు. కార్యక్రమంలో కూటమి ఎంపీ అభ్యర్థి టి.కృష్ణప్రసాద్, అద్దంకి, సంతమాగులూరు మాజీ ఎంపీపీలు మన్నం ఏడుకొండలు, సన్నెబోయిన ఏడుకొండలు, బీసీ నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీకి మద్దతు తెలిపిన వైదన వైసీపీ నేతలు

బల్లికురవ : మండలంలోని వైదన గ్రామానికి కొందరు వైసీపీ నేతలు బుధవారం ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను ఆయన స్వగృహంలో కలిసి మద్దతు తెలిపారు. వైదన గ్రామంలో వైసీపీలో ఉన్న గాలం శ్రీను, గాలం నిమ్మయ్య, కుంచపు శ్రీను, తోట సురేష్, ఆలకుంట శేషయ్య, షేక్ పెద భూడే, పంచాయతీ వార్డు మెంబరు నాగిపోగు చినబాబులు తమ అనచరులతో కలిసి రవికుమార్ సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పోగుల చంద్రశేఖర్, చినమేడ ప్రసాద్, షేక్ చినభూడే, మెరబోయిన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


గొట్టిపాటి సమక్షంలో టీడీపీలో చేరిన వైదన వైసీపీ నేతలు


వేదికపై అభివాదం చేస్తున్న కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కృష్ణప్రసాద్, గొట్టిపాటి, బీసీ నేతలు

సైకిల్ గుర్తుపై ఓటేసి గొట్టిపాటిని గెలిపించండి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 17: ఎన్నికలల్లో సైకిల్ గుర్తుపై ఓటేసి టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ గెలిపించాలని జడ్పీటీసీ మాజీ సభ్యుడు సందిరెడ్డి శ్రీనివాసరావు కోరారు. బుధవారం పట్టణంలోని రెండవ వార్డులో సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను ఇంటింటికీ తిరిగి పంచిపెట్టారు. గొట్టిపాటి నామినేషన్‌కు తరలివచ్చి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో 2వ వార్డు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెరువులకు చేరని సాగర్ జలాలు

- అరకొర విడుదలతో నిండేదెట్లా
- గ్రామస్థుల ఆందోళన

పంగులూరు, ఏప్రిల్ 17 : చెరువులకు సాగర్ జలాలు చేరే పరిస్థితి కనిపించడం లేదు. కొద్దిరోజులుగా తాగు నీటి అవసరాల కోసం విడుదలైన సాగర జలాలు పమిడిపాడు మేజర్‌కు బుధవారం అరకొరగా విడుదలయ్యాయి. రామకూరు మేజర్ వద్ద 90 క్యూసెక్కుల నీటిని పమిడిపాడు మేజర్ పరిధిలోని చెరువులు నింపేందుకు విడుదల చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివయ్య తెలిపారు. మండలంలో 10 నోటిఫైడ్, పది నాన్ నోటిఫైడ్ చెరువులను నింపాల్సి ఉండగా, ఒక్క రామకూరు చెరువుకు 50 శాతం నీరు చేరినట్లు ఏఈ తెలిపారు. నీటి కొరత ఎక్కువగా ఉండే నూజెళ్లపల్లి, ఆరికట్లవారిపాలెం చెరువులకు నేటికీ నీరు చేరలేదు. తాగు నీటి కోసం విడుదలైన సాగర్ జలాలు తక్కువగా విడుదలైతే చెరువులకు నీరు చేర్చడం ఎలా అని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం పమిడిపాడు మేజర్‌కు విడుదలైన నీటిని మండలంలోని జనకవరం, కొండమంజులూరు మళ్లిస్తున్నట్లు ఏఈ తెలిపారు. చెరువులను నింపకపోతే నీటి కష్టాలు తప్పవని పలు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.


పమిడిపాడు మేజర్‌లో అరకొరగా పారుతున్న సాగర్ జలాలు

రాములమ్మ నూరేళ్ల వసంతం

పంగులూరు, ఏప్రిల్ 17 : మండలంలోని భగవాన్‌రాజుపాలెం గ్రామంలో రాములమ్మకు వందేళ్లు నిండాయి. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు రాములమ్మ నూరేళ్ల వసంత వేడుకను నిర్వహించారు. నార్నె రాములమ్మ ఐదు తరాల కుటుంబ సభ్యులతో బుధవారం జరిగిన వేడుకలో బంధు మిత్రులు పాల్గొన్నారు.


కుటుంబ సభ్యులతో రాములమ్మ

రిజర్వేషన్ ఎత్తేస్తారని వైసీపీ ఫేక్ ప్రచారం

నమ్మొద్దని ముస్లింలకు హర్షవర్ధన్ విజ్ఞప్తి

సంతమాగులూరు, ఏప్రిల్ 17 : నాలుగు శాతం రిజర్వేషన్ ఎత్తేస్తారనే వైసీపీ నాయకులు చేస్తున్న ఫేక్ ప్రచారాన్ని ముస్లింలు నమ్మొద్దని టీడీపీ యువ నేత గొట్టిపాటి హర్షవర్ధన్ విజ్ఞప్తి చేశారు. మండలంలోని కొమ్మాలపాడు గ్రామంలో కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌కు మద్దతుగా తనయుడు హర్షవర్ధన్ ప్రచారం చేశారు. కూటమి ప్రభుత్వం వస్తేనే రాష్ట్రం బాగుపడు తుందని చెప్పారు. ఒక్క చాన్స్ వచ్చిన జగన్‌రెడ్డి, వైసీపీ నేతలు ఐదేళ్లలో రాష్ట్రాన్ని దోచుకున్నారని, రెండో చాన్స్ ఇస్తే ప్రజా ఆస్తులను కొల్లగొడతారని అన్నారు. ఐదేళ్లలో ఏ వర్గం ప్రజలు సంతోషంగా గడిపిన రోజు లేదన్నారు. ప్రతి చోటా దౌర్జన్యాలు, దాడులు, అక్రమ అరెస్టులతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారని తెలిపారు. ప్రజాస్వామ్య పద్ధతిలో, ధర్మబద్ధంగా పాలన సాగించే చంద్రబాబు కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నుకొని అరాచక వైసీపీ పాలకులకు ఓటుతో దెబ్బకొట్టాలని హర్షవర్ధన్ పిలుపునిచ్చారు. ప్రజలంతా టీడీపీ కూటమిని గెలిపించేందుకు సిద్ధమయ్యారని, ఇక ఓటమి తప్పదని గ్రహించిన జగన్ రెడ్డి కుల చిచ్చు కుట్రకు తెరలేపారన్నారు. అన్ని కులాలవారు, అన్ని వర్గాల ప్రజలు అప్రమత్తంగా ఉండి జగన్ మాయను తిప్పికొట్టాలన్నారు. బీజేపీతో పొత్తు వల్ల ముస్లిం, క్రిస్టియన్లకు ఎలాంటి కష్టం రాకుండా చంద్రబాబు చూస్తారని, ఆ ధైర్యంతో కూటమికి మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గాడిపర్తి వెంకట్రావు, దూపాటి ఏసోబు, తెలప్రోలు రమేష్, చేవూరి వాసిరెడ్డి, సన్నెబోయిన ఏడుకొండలు, చింతా రామారావు, శ్రీరామమూర్తి, కోటేశ్వరరావు, గురుయాదవ్, సుజాత, చల్లా కృష్ణ, రామాంజి, మురళి, అంకమ్మరావు, మోతాదు బాషా, బాజీ మసూద్ హఫీస్ లాల్‌బుడే, మీరస, హుక్కు, దర్యావలి, పెద్ద మీరసా, మస్తాన్‌వలి, గొట్టిపాటి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


పథకాలపై అవగాహన కల్పిస్తున్న హర్షవర్ధన్

ఇంకొల్లులో టీడీపీలోకి పెరిగిన వలసలు



టీడీపీలో చేరిన ఇంకొల్లు కృష్ణనగర్‌వాసులు ... ఎమ్మెల్యే ఏలూరికి మద్దతు తెలిపిన కారంచేడు యువత

- సైకిలెక్కిన వైసీపీకి చెందిన ప్రముఖ నేతలు
- ఆహ్వానించిన ఎమ్మెల్యే ఏలూరి

ఇంకొల్లు, ఏప్రిల్ 17 : ఇంకొల్లు మండలంలో టీడీపీలోకి వలసలు పెరిగాయి. ఇప్పటివరకు వైసీపీలో ఉన్న ప్రముఖ నేతలు ఆ పార్టీని వీడి పసుపు కండువాను కప్పుకున్నారు. పార్టీ మండలాధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, మరికొందరు నేతలు మండలంలోని ఇడుపులపాడులో 40 మంది బీసీలు సైకిల్ ఎక్కారు. పూసపాడు గ్రామానికి చెందిన 20 కుటుంబాలవారు వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చారు. ఇంకొల్లు వైసీపీ ఎంపీటీసీ సభ్యుడు ఆయోషాబుడేతోసహా 15 కుటుంబాలు మంగళవారం చేరగా, కృష్ణనగర్‌కు చెందిన కొంతమంది వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే ఏలూరి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కృష్ణనగర్‌కు చెందిన 17 కుటుంబాలు నిడగంటి నాగేశ్వరరావు, పసుపులేటి బాలకృష్ణ, పసుపులేటి ప్రసాద్, పసుపులేటి మాధవరావు, పసుపులేటి మల్లేశ్వరరావు, నీడగంటి వెంకటనారాయణ, దత్తాత్రేయ, రవీంద్రబాబు బుధవారం చేరగా ఏలూరి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

ఏలూరి వెంట కారంచేడు యువత

పర్చూరు : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయానికి మేము సైతం అటూ యువత ముందుకు సాగుతోంది. ఎమ్మెల్యే చేపడుతున్న ఎన్నికల ప్రచారంలో పెద్దఎత్తున తరలి వచ్చి ఏలూరికి మద్దతుగా నిలుస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం ఏలూరి మండలంలోని ఉప్పుటూరు గ్రామంలో పర్యటిస్తున్న నేపథ్యంలో కారంచేడు గ్రామానికి చెందిన యువకులు మూకుమ్మడిగా తరలి వచ్చి మేము సైతం మీకు తోడుగా అంటూ ఏలూరి వెంట నడిచారు. యువత రాకతో టీడీపీలో జోష్ పెరిగింది.


వైసీపీ సర్పంచ్ సీతామహాలక్ష్మిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరులో టీడీపీ శ్రేణుల ప్రచారం

మార్టూరు : అంబేడ్కర్‌నగర్‌లో బుధవారం టీడీపీ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థి ఏలూరి సాంబశివరావును మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వ ఏర్పాటుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని తెలిపారు. ఈ సందర్భంగా సూపర్‌సిక్స్ పథకాలు, మహిళా శక్తి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. టీడీపీ అధికారంలోకి రాగానే నియోజకవర్గంలో 25వేల మంది పేదలకు ఏలూరి ఇంటి స్థలాలు ఇస్తారన్నారు. అంబేడ్కర్ నగర్‌లో జరిగిన అభివృద్ధిని మర్చిపోకుండా ఏలూరికి మద్దతు పలకాలన్నారు. కార్యక్రమంలో జంపని శ్రీను, కన్నెగంటి శ్రీను, కామినేని జనార్దన్, షేక్ రజాక్ తాటి నాగేశ్వరరావు, పుట్టా శ్రీను, కాకోలు వెంకటేశ్వర్లు, గన్నవరం బుడే, రావినేని శ్రీను, గొట్టిపాటి వెంకట్రావు, భూలక్ష్మి, రుక్మిణి, శేషమ్మ, శివమ్మ పాల్గొన్నారు.

వైసీపీని వీడిన నాయుడువారిపాలెం సర్పంచ్

వందలాదిమంది టీడీపీలో చేరిక

నాయుడువారిపాలెం (పర్చూరు) : కారంచేడు మండలం నాయుడువారిపాలెం గ్రామ వైసీపీ సర్పంచ్ గుమ్మడి సీతామహాలక్ష్మి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో బుధవారం పార్టీలోకి చేరారు. ఆమెతోపాటు, గ్రామానికి చెందిన వందలాదిమంది వైసీపీకి గుడ్‌బై చెప్పి సైకిలెక్కారు. వారందరికీ ఏలూరి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో గుమ్మడి రామ్మోహన్, నాయుడు సుబ్బారావు, జరుగుల జయప్రకాష్, రాధా లక్ష్మి ఆధ్వర్యంలో పలువురు వైసీపీ నాయకులు కార్యకర్తలు మూకుమ్మడిగా టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ కలసి పని చేసి రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి కృషి చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని ఏలూరి అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం మండలపార్టీ అధ్యక్షుడు తిరుములశెట్టి శ్రీహరి, నాయకులు ఉన్నారు.

ఏలూరి గెలుపు కోసం విస్తృత ప్రచారం

పర్చూరు : ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విజయాన్ని కాంక్షిస్తూ కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృత ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే ఏలూరికి అఖండ మెజార్టీతో హ్యాట్రిక్ విజయం చూకూర్చాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం పర్చూరులోని ప్రధాన వీధుల్లో ప్రచారం సాగింది. జగన్‌రెడ్డి పాలనలలో అన్ని రంగాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం కూటమిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తెలుగుదేశం పట్టణ పార్టీ అధ్యక్షుడు అగ్నిగుండాల వెంకటకృష్ణారావు, కొల్లా శివరాం ప్రసాద్, కొండ్రగంటి శివనాగేశ్వరావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, మల్లాది సురేష్, అబ్రహం, నాగరాజు, కొల్లా చౌదరి, పఠాన్ మీరావలి, కోటగిరి ప్రసాద్, మహిళా నాయకులు పూరిమెట్ల జయమ్మ, ఊటుకూరి నిర్మల, కొల్లా సుబ్బమ్మ, జనసేనులు దీర్ఘాల రమేష్, తులసి చంటి, అచ్చికోలు సతీష్, సుధాకర్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..ఆత్మీయత

పలు కార్యక్రమాల్లో పాల్గొన్న కూటమి అభ్యర్థి కొండయ్య

చీరాల, ఏప్రిల్ 17 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య బుధవారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆత్మీయ కార్యక్రమాల్లో పాల్గొని, స్థానికులు, భక్తులతో ఆత్మీయంగా మాట్లాడారు. మండల పరిధిలోని బోయినవారిపాలెంలో శ్రీరామనవమి సందర్భంగా జరిగిన సీతారాముల కల్యాణ మహోత్సవ ప్రత్యేక పూజల్లో కొండయ్య పాల్గొన్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రతి ఒక్కరూ మా కొండయ్య అంటూ పక్కవారికి పరిచయం చేశారు. అనంతరం కావూరివారిపాలెంలో బ్రహ్మంగారి గుడి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


బ్రహ్మంగారి గుడి కార్యక్రమంలో పాల్గొన్న కొండయ్య


మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి కొండయ్య

కూటమి నేతల విస్తృత స్థాయి సమావేశం

చీరాల, ఏప్రిల్ 17 : త్వరలో జరగబోయే ఎన్నికలలో ఎలాంటి ప్రణాళికలు అనుసరించాలనే అంశంపై చర్చించడానికి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం. కొండయ్య అధ్యక్షతన టీడీపీ, జనసేన, బీజేపీ నేతల విస్తృత స్థాయి సమావేశం బుధవారం చీరాల పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని ఓటరును కలిసి వైసీపీ వైఫల్యాలను వివరించడమే లక్ష్యంగా ముందుకుసాగలన్నారు. ఎన్నికలలో ఎలాంటి వ్యూహాలను అమలు చేయాలనే అంశాలపై కూటమి నేతలు చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నాతాని ఉమామహేశ్వరరావు, సీనియర్ నాయకురాలు సజ్జా హేమలత, జనార్దన్, శ్రీనివాసరావు ఇతర నేతలు పాల్గొన్నారు

టీడీపీ ప్రచారంలో పాల్గొనలేదు

- వల్లాపల్లి వీఆర్‌ఏ వివరణ
- ముస్లింలంతా టీడీపీలోకి వెళ్తున్న అక్కసుతోనే తప్పుడు వార్త

బల్లికురవ, ఏప్రిల్ 17 : టీడీపీ ఎన్నికల ప్రచారంలో తాను పాల్గొనలేదని కావాలనే కొందరు తనపై పత్రికల్లో వార్త రాయించారని వల్లాపల్లి గ్రామానికి చెందిన వీఆర్‌ఏ షేక్ జాన్ సాహెబ్ బుధవారం తెలిపారు. వల్లాపల్లిలో ముస్లింలందరూ టీడీపీ వైపు వెళ్లారనే కోపంతో వైసీపీ నేతలు గతంలో తాను పసుపు రంగుతో పోలి ఉన్న కండువాతో ఉన్న ఫొటోను అధికార పార్టీ పత్రికకు అందజేసి తనపై తప్పుడు వార్తను రాయించారని తెలిపారు. వల్లాపల్లి గ్రామంలో గత శుక్రవారం జరిగిన టీడీపీ ప్రచారం కార్యక్రమంలో తాను పాల్గొన్నట్లు బుధవారం వచ్చిన వార్తపై ఉన్నతాధికారులకు వివరణ ఇస్తానని తెలిపారు. ముస్లిం అయినందునే తనపై తప్పుడు వార్త రాయించి, ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని షేక్ జాన్ సాహెబ్ ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు రోజుల కిందట తాను టీడీడీ ప్రచారంలో పాల్గొన్నట్లు వార్త రాయించమేమిటని ప్రశ్నించారు.

నీటికుంటలో వ్యక్తి మృతదేహం

చీరాలటౌన్, ఏప్రిల్ 17 : చీరాల పరిధిలో గుర్తు తెలియని వ్యక్తుల మృతదేహాలతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. గత శుక్రవారం మండల పరిధిలోని ఈపూరుపాలెం పద్మనాభునిపేటలో ఇంటి నిర్మాణం కోసం యజమాని ఇంటికి ఇసుక తీసుకురాగా అందులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉండడంతో అందరూ ఆందోళన చెందారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం మండల పరిధిలోని విజయనగర్ కాలనీ శివారులోని నీటి కుంటలో మరో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. విచారణ అనంతరం విజయనగర్ కాలనీకి చెందిన మోటూరి జయరావు(58)గా గుర్తించారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టంకు తరలించారు. బహిర్భూమికి వచ్చి నీటికుంటలో జారిపడి మృతిచెందినట్లు భావిస్తున్నారు. వరుస సంఘటనలతో పోలీసులకు తలలు బొప్పికడుతున్నాయి. ఈ కేసులను పోలీసులు ఎలా ఛేదిస్తారో చూడాలి.


కుంటలో మృతదేహం

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

బల్లికురవ, ఏప్రిల్ 17 : మండలంలోని వైదన గ్రామం వద్ద రెండు రోజుల కితం బైకుపై నుంచి కింద పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు బండారు రాజు(52) బుధవారం మృతి చెందినట్లు ఏఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు. అద్దంకి మండలం చినకొత్తపల్లి గ్రామానికి బండారు రాజు తన కుమారుడు మహేంద్రతో కలిసి సోమవారం బల్లికురవ మండలం ఎస్‌ఎల్ గుడిపాడు కొలువుల భోజనానికి వచ్చి తిరిగి వెళుతుండగా జరిగిన ప్రమాదంలో రాజు గాయపడ్డారు. ఒంగోలు ఆసుపత్రిలో చికిత్స పొందుతు మృతి చెందారు. కుమారుడు మహేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

48 మద్యం బాటిళ్లు స్వాధీనం

మార్టూరు, ఏప్రిల్ 17 : మార్టూరులో కొణిదెన రోడ్ నుంచి నాగరాజుపల్లి రోడ్‌లోకి వెళ్లే మట్టిరోడ్డులో బుధవారం నడిచి వెళ్తున్న కోనంకి అంజయ్య అనే వ్యక్తి నుంచి 48 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. అద్దంకి మండలం చిన్న కొత్తపల్లికి చెందిన అంజయ్య గోతాంలో అక్రమంగా మద్యం బాటిళ్లను తీసుకెళ్తున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు సోదాలు చేసి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సైదా, కానిస్టేబుల్ రామకోటేశ్వరరావు ఉన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

మేదరమెట్ల : జాతీయ రహదారిలో మేదరమెట్ల వద్ద ఎస్‌ఈబీ అధికారులు ప్రైవేట్ ట్రావెల్ బస్సును తనిఖీ చేసి నాలుగు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం వేకువజామున హైదరాబాద్ నుంచి కొండపి వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు డ్రైవర్ రెండు లీటరు బాటిళ్లు, రెండు 750 ఎంఎల్ బాటిళ్లు తరలిస్తుండగా అధికారులు పట్టుకున్నారు. డ్రైవర్‌ను బస్సును అదుపులోకి తీసుకున్నారు. ప్రయాణికులను వేరే బస్సుల్లోకి ఎక్కించారు. అద్దంకి ఎస్‌ఈబీ ఎస్సై వీరవల్లి సైమన్ కేసు నమోదు చేశారు.


స్వాధీనపర్చుకున్న మద్యం సీసాలు

వ్యక్తిపై దాడికి పాల్పడిన పలువురిపై ఫిర్యాదు

చీరాలటౌన్, ఏప్రిల్ 17 : వ్యక్తిపై దాడికి పాల్పడిన పలువురిపై బాధితుడు చీరాల టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని ఈపూరుపాలెంకు చెందిన ఈశ్వర్‌పై మంగళవారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో సాయికాలనీలో కల్యాణి మరికొందరు దాడిచేశారు. దీంతో అతను చీరాల ఏరియా వైద్యశాలలో అవుట్‌పోస్ట్ పోలీసులకు అందించిన సమాచారం మేరకు టూటౌన్ పోలీసులు విచారణ చేస్తున్నారు. దీనిపై కల్యాణి మాట్లాడుతూ ఈశ్వర్ గోడదూకి ఇంట్లోకి చొరబడి చోరీకు యత్నించే క్రమంలో అతడిని పోలీసులకు అప్పగించినట్లు చెప్పారు. దాడి జరిగిన దాఖలాలు లేవని చెప్పారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూటమి గెలుపుతోనే యువతకు భవిత

ఇంకొల్లు, ఏప్రిల్ 17 : కూటమి గెలుపుతోనే యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జనసేన ఆర్టీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పెద్దపూడి విజయ్ కుమార్ అన్నారు. ఇంకొల్లులో బుధవారం తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల ఆధ్వర్యంలో యువత మేలుకో కార్యక్రమంలో భాగంగా స్థూపం సెంటర్ నుంచి కడవకుదురు రోడ్డు, సినిమాహాల్ కూడలి మీదగా నాగులచెరువుకట్ట వద్ద ఎన్టీఆర్ విగ్రహం వరకు యువత, నాయకులు ర్యాలీ నిర్వహించారు. జగన్‌రెడ్డి పాలనలో యువత ఉద్యోగాలు లేక నిరుద్యోగులుగా మిగిలిపోయారని, యువత ఉజ్వల భవిష్యత్ కోసం విద్యావంతులు, యువత కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని విజయకుమార్ విజ్ఞప్తి చేశారు. వైసీపీ పాలనలో రాజధాని లేని రాష్ట్రంగా మార్చారన్నారు. కార్యక్రమంలో రావిపాటి అరుణ, పవన్, పొద శ్రీరామ చంద్రమూర్తి, బాచిన తిరుపతయ్య,కొల్లిపర కల్యాణకుమార్, నాగ అనిల్, చింతనిప్పల సుమంత్, గోగినేని మురళి, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న యువత, కూటమి నేతలు